ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

1



కర్ణాటక వార్తలు

బుధవారం 5 జూన్ 2024

కుమారస్వామికి అమిత్‌షా పిలుపు



బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడగానే కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ కీలకనేత అమిత్‌షా రాష్ట్ర జేడీఎస్ పార్టీ అధ్యక్షుడు, మండ్య నుంచి విజయం సాధించిన కుమారస్వామిని ఢిల్లీకి ఆహ్వానించారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు ప్రకటించగానే అమిత్‌షా నేరుగా కుమారస్వామికి ఫోన్ చేశారు. విజయం సాధించడంపై శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఢిల్లీలో జరిగే ఎన్డీయే పార్టీల సమావేశానికి రావాలని ఆహ్వానించారు.



శోభాకరంద్లాజె, బీజేపీ బెంగళూరు ఉత్తర | తేజస్వి సూర్య, బీజేపీ బెంగళూరు దక్షిణ | పీసీ మోహన్, బీజేపీ బెంగళూరు సెంట్రల్ | డాక్టర్ మంజునాథ్, బీజేపీ బెంగళూరుగ్రామీణ | సునిల్‌బోస్ , కాంగ్రెస్ చామరాజనగర | గోవింద కారజోళ, బీజేపీ చిత్రదుర్గ | డాక్టర్ సుధాకర్, బీజేపీ చిక్కబళ్లాపుర | మల్లేశ్‌బాబు , జేడీఎస్, కోలారు | కుమారస్వామి, జేడీఎస్, మండ్య | కెప్టెన్ బ్రిజేశ్ చౌట బీజేపీ, దక్షిణకన్నడ | శ్రేయస్ పటేల్ హాసన్, కాంగ్రెస్ | యదువీర్, బీజేపీ మైసూరు | సోమణ్ణ , బీజేపీ తుమకూరు | కోట శ్రీనివాస పూజారి చిక్కమగళూరు



రాఘవేంద్ర బీజేపీ, శివమొగ్గ | ప్రభామల్లికార్జున్ కాంగ్రెస్, దావణగెరె | బసవరాజ్ బొమ్మై బీజేపీ, హావేరి | విశ్వేశ్వరహెగ్డే కాగేరి బీజేపీ,ఉత్తరకన్నడ | ఇ.తుకారాం బళ్లారి, కాంగ్రెస్ | కుమార్ నాయక్ కాంగ్రెస్, రాయచూరు | సాగర్ ఖండ్రె కాంగ్రెస్, బీదర్ | ప్రహ్లాద్‌జోషి బీజేపీ, దారవాడ | జగదీశొట్టర్ బీజేపీ, బెళగావి | ప్రియాంక జర్కిహోళి, కాంగ్రెస్, చిక్కోడి | పీసీ గద్దిగౌడర్, బీజేపీ, బాగల్కోటె | రాధాకృష్ణ దొడ్డమని కాంగ్రెస్, కలబురగి | రమేశ్ జిగజిణగి బీజేపీ, విజయపుర | రాజశేఖర హిట్నాల్ కాంగ్రెస్, కొప్పళ

కాంగ్రెస్‌కు నిరాశ

- గత స్థానాలను కోల్పోయిన కమలం
- ఇరు పార్టీలకూ నిరుత్సాహమే
- బీజేపీకి 17, జేడీఎస్‌కు 2 స్థానాలు
- కాంగ్రెస్ ఖాతాలో 9 లోక్‌సభ స్థానాలు



బీజేపీ కార్యాలయం వద్ద సంబరాలు

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి నిరాశే మిగిల్చాయి. ప్రతిపక్ష బీజేపీకి కూడా నిరుత్సాహమే మిగిలింది. అధికార కాంగ్రెస్ పార్టీకి గతంకంటే మెరుగు అనిపించినా ప్రస్తుత శాసనసభ స్థానాలతో పోల్చితే ఘోరంగా దెబ్బతిన్నట్టయింది. 28 స్థానాల్లో అధికార కాంగ్రెస్ 9 స్థానాలు దక్కించుకోగా బీజేపీ 17, జేడీఎస్ రెండు స్థానాల్లో గెలుపొందాయి. గత ఎన్నికల్లో బీజేపీ ఇండిపెండెంట్ ఎంపీ సుమలత మద్దతుతో కలిపితే 26 కాగా, ప్రస్తుత ఫలితాలతో 9 స్థానాలు కోల్పోయింది. గతంలో జేడీఎస్ ఒకస్థానం మాత్రమే ఉండగా బీజేపీతో కూటమి కారణంగా రెండు స్థానాలు గెలుపొందింది. కాంగ్రెస్ ఒక స్థానం నుంచి 9కి పెరిగింది. శాసనసభలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు 135 మంది ఎమ్మెల్యేలు ఉన్నా మూడింట ఒకశాతం లోక్‌సభ స్థానాలకే పరిమితమయింది.

వారసులకు దెబ్బ

కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లు కేటాయించడంలో మంత్రుల వారసులకు ప్రాధాన్యత ఇచ్చారు. వీరిలో చిక్కోడి నుంచి ప్రియాంక జార్కిహోళి, బీదర్ నుంచి సాగర్‌ఖండ్రె, చామరాజనగర నుంచి సునిల్‌బోస్ గెలుపొందగా బెంగళూరు దక్షిణ నుంచి సౌమ్యారెడ్డి, బెళగావి నుంచి మృణాల్ హెబ్బాళ్కర్, బాగల్కోటె నుంచి సంయుక్తాపాటిల్, శివమొగ్గ నుంచి మంత్రి మధుబంగారప్ప అక్క గీత ఓడిపోయారు. మరో మంత్రి మల్లికార్జున భార్య ప్రభా దావణగెరె నుంచి గెలుపొందారు.

ఓడిన సిట్టింగులు

బీజేపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్రమంత్రిగా ఉన్న భగవంత్ ఖూబా బీదర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయారు. మల్లికార్జున ఖర్గే అల్లుడి చేతిలో కలబురగి నుంచి ఉమేశ్‌జాధవ్ ఓటమి చెందారు. చిక్కోడి నుంచి అన్నాసాహెబ్‌జొల్లె ఓడిపోయారు.

ప్రతిభావంతులకు పట్టం

రాజకీయాలతో సంబంధంలేని నలుగురు వ్యక్తులకు టిక్కెట్లు ఇచ్చి బీజేపీ ప్రయోగం చేసింది. భిన్నమైన రంగాలలో ప్రతిభావంతులుగా రాణిస్తున్న వీరు సొంత నియోజకవర్గాల్లో రికార్డులు తిరగరాయడమే కాకుండా సమీప నియోజకవర్గాలపైనా పెను ప్రభావం చూపారు. హృద్రోగ నిపుణుడు, పద్మశ్రీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ బెంగళూరు గ్రామీణ నుంచి దాదాపు రెండు లక్షల మెజారిటీతో గెలుపొందారు. మైసూరు నుంచి రాజవంశస్థుడు యదువీర్ గెలుపు సునాయాసం అనిపించింది. రాజకుటుంబం ఇరవైయేళ్ల తర్వాత మరోసారి రాజకీయాల్లో క్రియాశీలమయ్యేందుకు కారణమైంది. దక్షిణకన్నడలో కెప్టెన్ బ్రిజేశ్‌చౌటకు టిక్కెట్ ఇచ్చి గెలిపించింది. ఎన్నికల్లో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె గెలుపొందారు. తేజస్వి సూర్య, పీసీ మోహన్, రమేశ్ జిగజిణగి, బీవై రాఘవేంద్ర, పీసీ గద్దిగౌడర్‌లు మరోసారి విజయం సాధించారు. శాసనసభ మాజీ స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరి ఉత్తరకన్నడ నుంచి గెలుపొందగా విధానపరిషత్ ప్రతిపక్షనేతగా వ్యవహరిస్తున్న కోట శ్రీనివాసపూజారి లోక్‌సభకు వెళ్లారు. ఈయన ప్రత్యర్థి బీసీ కమిషన్ ఛైర్మన్‌గా వ్యవహరించిన జయప్రకాశ్ హెగ్డే చివరి క్షణంలో కాంగ్రెస్‌కు వెళ్లినా ప్రయోజనం దక్కలేదు. పైగా కోట శ్రీనివాసపూజారికి హిందీ భాషరాదని చేసిన వ్యాఖ్య తిప్పికొట్టినట్టయింది. గత శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయి ప్రస్తుతం ఎంపీలుగా గెలుపొందినవారిలో తుమకూరు నుంచి సోమణ్ణ, ఉత్తరకన్నడ నుంచి విశ్వేశ్వరహెగ్డే కాగేరి, చిక్కబళ్ళాపుర నుంచి డాక్టర్ సుధాకర్, చిత్రదుర్గ నుంచి గోవింద కారజోళ, బెళగావి నుంచి జగదీశ్‌శెట్టర్ ఉన్నారు.

ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్యే స్థానాలు

చెన్నపట్టణ నుంచి గెలుపొందిన కుమారస్వామి ప్రస్తుతం మండ్య ఎంపీ కావడం, శిగ్గావ్ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూన్న బసవరాజ్ బొమ్మై హావేరి ఎంపీ కావడం, సండూరి నుంచి ఎమ్మెల్యేగా ఉన్న తుకారాం ప్రస్తుతం బళ్లారి ఎంపీగా గెలుపొందారు. ఇక పరిషత్ సభ్యుడు కోట శ్రీనివాసపూజారి ఉడుపి-చిక్కమగళూరు నుంచి గెలుపొందడంతో సదరు స్థానాలు ఖాళీ కానున్నాయి. రిటైర్డు ఐఏఎస్ అధికారి కుమార్‌నాయక్ రాయచూరు నుంచి కాంగ్రెస్ తరపున గెలుపొందారు. శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మాజీమంత్రి ఈశ్వరప్ప చిత్తుగా ఓడిపోయారు.

పరువు నిలుపుకొన్న యడియూరప్ప

బీజేపీ సొంతంగా 17 స్థానాలు, జేడీఎస్ రెండింటితో కలిపి 19 స్థానాలు సాధించడంతో యడియూరప్ప కుటంబానికి పరువు దక్కినట్టయింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా విజయేంద్ర, కేంద్ర పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగా యడియూరప్ప ఉన్నారు. మరో కుమారుడు రాఘవేంద్ర శివమొగ్గ నుంచి ఎంపీగా గెలుపొందారు. ఏమాత్రం తక్కువసీట్లు వచ్చినా యడియూరప్ప కుటుంబంపై పెనుప్రభావం చూపేది.

డీకే శివకుమార్‌కు కోలుకోలేని దెబ్బ

రాష్ట్ర రాజకీయాల్లో ఎదురే లేదని భావించిన కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. గతంలో కాంగ్రెస్ నుంచి ఒక్కడే అంటూ బెంగళూరు గ్రామీణ నుంచి గెలుపొందిన డీకే సురేశ్ చిత్తుగా ఓడిపోయారు. ఎన్నికల కోసం వారు పన్నిన వ్యూహాలను ప్రజలు తిప్పికొట్టారు. హృదయాలను గెలిచిన గుండెశస్త్రచికిత్సల నిపుణుడు డాక్టర్ సీఎన్ మంజునాథ్ ప్రజల మనసులో చిరస్థానం ఏర్పాటు చేసుకున్నారు. దాదాపు 2లక్షలకు పైగానే మెజారిటీ సాధించారు. డీకే సురేశ్, డీకే శివకుమార్ ప్రచారహోరుతోపాటు పంపిణీలు, వ్యతిరేకత ఉండకూడదని ఇతర పార్టీలకు చెందినవారిని ప్రతి గ్రామం నుంచి చేర్చుకున్నా చిత్తుగా ఓడిపోయారు. ఫలితాల తర్వాత డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ ఓటమితో పాఠాలు నేర్చుకున్నామని, పొరపాటు జరిగిందో సమీక్షించుకుంటామన్నారు.

నిండా మునిగిన ప్రజ్వల్

గత లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్ నుంచి ఏకైక ఎంపీగా గెలుపొందిన ప్రజ్వల్ రేవణ్ణ చిత్తుగా ఓడిపోయారు. ఎంపీగా కొనసాగుతూ ప్రజాసేవ చేయాల్సిన ఎంపీ రాసలీలల వివాదంలో ఇరుక్కుపోయారు. జర్మనీకి పరారై నెల రోజుల తర్వాత బెంగళూరుకు రాగానే ఎయిర్‌పోర్ట్‌లో అరెస్టయ్యారు. ప్రస్తుతం సిట్ కస్టడీలో ఉన్నారు. హాసన్‌లో గెలుపొందిన శ్రేయస్‌పటేల్ మరో రికార్డును నమోదు చేశారు. దశాబ్దాలక్రితం మాజీ ప్రధాని దేవెగౌడను పుట్టస్వామిగౌడ ఓడించారు. ప్రస్తుత ఎన్నికల్లో పుట్టస్వామిగౌడ రాజకీయ వారసుడు శ్రేయస్‌పటేల్ ఇప్పుడు దేవెగౌడ మనవడు ప్రజ్వల్‌ను ఓడించారు.



జేడీఎస్ నేత కుమారస్వామికి సన్మానం

సర్వేలన్నీ తప్పులే

- రాహుల్‌ను ప్రజలు ఆదరించారు: సీఎం

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎగ్జిట్‌పోల్ సర్వేలన్నీ తప్పులేనని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత అధికారిక నివాసంలో మీడియాతో మాట్లాడారు 15-20 స్థానాల్లో విజయం సాధిస్తామని భావించామని అన్నారు. 2019లో ఒక్కస్థానం ఉండగా ఇప్పుడు 9స్థానాలకు పెరిగామని అన్నారు. ఎన్నికల్లో తమకు 45.34, బీజేపీకి 46.04 ఓట్ల శాతం దక్కాయన్నారు. ఓట్ల శాతంలో పెరిగామన్నారు. దేశంలో బీజేపీ స్పష్టమైన మెజారిటీ సాధించడంలో విఫలమయిందన్నారు. దేశమంతటా మోదీ ప్రభావం కనిపించలేదన్నారు. ఫలితాలను బట్టి మోదీ ప్రజాదరణ మట్టి గరిచిందన్నారు. మోదీ ఎన్నికల్లో హిందూత్వ, దేవుడి పేరిట ఓట్లు అడిగారని, ఇతర మతాలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. మోదీకి మరోసారి ప్రధాని అయ్యే నైతికత లేదన్నారు. ప్రతిపక్ష నాయకులు, ముఖ్యమంత్రులను జైళ్లకు పంపడం, ఈడీ, ఐటీ, సీబీఐలతో బెదరించడంతో బీజేపీకి మెజారిటీ రాలేదన్నారు. రాముడు, రామమందిరం పేరిట అయోధ్యలోనూ బీజేపీ ఓడిందన్నారు. రాహుల్‌గాంధీ జరిపిన 2 పాదయాత్రలు ఫలించాయన్నారు. రాహుల్‌గాంధీకి దేశమంతటా ప్రజాదరణ పెరిగిందన్నారు.



మీడియాతో సీఎం సిద్ధరామయ్య

ఐదుగురికి రాజకీయ పునర్జన్మ

- ఎమ్మెల్యేలుగా ఓడి...

లోక్‌సభలో విజయదుందుభి

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఏడాది కిందట శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయి రాజకీయ నిరుద్యోగులుగా గడిపి లోక్‌సభ ఎన్నికల్లో ఐదుగురు సీనియర్లు సత్తాచాటారు. వారంతా బీజేపీ నుంచి గెలుపొందడం గమనార్హం. జగదీశ్‌శెట్టర్, డాక్టర్ కె.సుధాకర్, వి.సోమణ్ణ, విశ్వేశ్వరహెగ్డే కాగేరి, గోవింద కారజోళ ఉన్నారు.

బెళగావి నుంచి జగదీశ్ శెట్టర్

రాష్ట్ర రాజకీయాల్లో చిరపరిచితులు, కీలకమైన ముఖ్యమంత్రి పదవిలోనూ కొనసాగి ఎమ్మెల్యేగా ఓడిపోయిన జగదీశ్‌శెట్టర్ ఎంపీగా గెలుపొందారు. సొంత జిల్లా హుబ్బళ్లి-ధారవాడను వీడి బెళగావి నుంచి బరిలోకి దిగి రాణించారు. రాష్ట్ర మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్ హెబ్బాళ్కర్‌పై సత్తా చాటారు. శాసనసభ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరి పోటీ చేసి ఓడిపోయారు. ఎమ్మెల్సీ చేసినా కేవలం కొన్ని రోజులకే కాంగ్రెస్‌ను వీడి సొంతగూటికి చేరారు. అనూహ్యంగా బెళగావి నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందారు.

చిక్కబళ్లాపుర నుంచి డాక్టర్ సుధాకర్

కాంగ్రెస్‌లో కొనసాగుతూ 2019 సంక్షోభంలో బీజేపీవైపు వెళ్లి ఎమ్మెల్యేగా గెలుపొంది మూడున్నరేళ్లపాటు వైద్య ఆరోగ్య, వైద్యవిద్యాశాఖల మంత్రిగా వ్యవహరించి కొవిడ్ క్లిష్టకాలంలో సమర్థవంతంగా రాణించారు. ఇటీవలి ఎన్నికల్లో స్వగ్రామానికి చెందిన విద్యాసంస్థల యజమాని చేతిలో ఓటమి చెందారు.

ఉత్తరకన్నడ నుంచి విశ్వేశ్వరహెగ్డే కాగేరి

ఉత్తరకన్నడ జిల్లా శిరసి నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా కొనసాగారు. గడిచిన మూడున్నరేళ్ల బీజేపీ పాలనలో శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించారు. గత ఏడాది శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయారు.

తుమకూరు నుంచి సోమణ్ణ

రాష్ట్ర రాజకీయాల్లో అనుభవం ఉన్న నేతల్లో సోమణ్ణ ఒకరు. కార్పొరేటర్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ఎమ్మెల్యేగా, మంత్రిగా వ్యవహరించారు. బీజేపీ ఢిల్లీ పెద్దలు సూచన మేరకు సొంత నియోజకవర్గం గోవిందరాజనగరను వదిలి చామరాజనగరతోపాటు ప్రస్తుత సీఎం సిద్దరామయ్యపై వరుణ నుంచి పోటీ చేశారు. రెండుచోట్ల ఓడిపోయారు. తీవ్ర నిరాశకు గురై బహిరంగంగానే రాజకీయ నిరుద్యోగి అయ్యానంటూ కంటతడిపెట్టారు. పార్టీ అధ్యక్షస్థానం కోసం చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి.

చిత్రదుర్గ నుంచి గోవింద కారజోళ

రాష్ట్ర బీజేపీలో మూడు దశాబ్దాలకుపైగా కొనసాగి ఎన్నో కీలకమైన మంత్రి పదవుల్లో రాణించారు. యడియూరప్పకు అత్యంత సన్నిహితుల్లో ఒకరిగా ఉన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయారు. చిత్రదుర్గ అభ్యర్థి అయి గెలుపు సాధించారు.

రాష్ట్రం నుంచి ముగ్గురు మహిళలు

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాల నుంచి ముగ్గురు మాత్రమే మహిళలు ఢిల్లీ పీఠం ఎక్కారు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి కేవలం చిక్కమగళూరు నుంచి గెలుపొంది శోభాకరంద్లాజె ఒకరు మాత్రమే ఎంపీగా ఉన్నారు. ఆమె ప్రస్తుతం కేంద్రమంత్రిగాను ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో మరోసారి బెంగళూరు ఉత్తర నుంచి విజయం సాధించారు. మంత్రిగా వ్యవహరిస్తున్న సతీశ్‌జార్కిహోళి కుమార్తె ప్రియాంక జార్కిహోళి చిక్కోడి నుంచి విజయం సాధించారు. ఇక దావణగెరె నుంచి మరో రాజకీయ దిగ్గజ నేత శామనూరు శివశంకరప్ప కుటుంబం నుంచి మరొకరు ఎంట్రీ ఇచ్చారు.

మూడు సామాజిక వర్గాలదే ఆధిపత్యం

లోక్‌సభ ఎన్నికల్లో మూడు సామాజిక వర్గాలు ప్రాబల్యం చూపాయి. 28 స్థానాలకుగాను ఏడుగురు లింగాయత సామాజిక వర్గం నుంచి గెలుపొందారు. వీరిలో.. జగదీశొట్టర్, బసవరాజ్ బొమ్మై, సోమణ్ణ, సాగర్‌ఖండ్రె, ప్రభా మల్లికార్జున, బీవై రాఘవేంద్ర, పీసీ గద్దిగౌడర్ ఉన్నారు. ఇక ఐదుగురు ఒక్కలిగలలో.. కుమారస్వామి, శోభాకరంద్లాజె, డాక్టర్ మంజునాథ్, శ్రేయస్ పటేల్, డాక్టర్ సుధాకర్ ఉన్నారు. బ్రాహ్మణ సముదాయం నుంచి విశ్వేశ్వరహెగ్డే కాగేరి, ప్రహ్లాద్‌జోషి, తేజస్వి సూర్య ఉన్నారు. 8 మంది ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందినవారు విజయం సాధించారు. వీరిలో కోలారు నుంచి మల్లేశ్‌బాబు, బిజాపూర్ నుంచి రమేశ్ జిగజిణగి, చిత్రదుర్గ నుంచి గోవింద కారజోళ, చామరాజనగర నుంచి సునిల్ బోస్, కలబురగి నుంచి రాధాకృష్ణ దొడ్డమని, బళ్లారి నుంచి తుకారాం, రాయచూరు నుంచి కుమార్‌నాయక్, చిక్కోడి నుంచి ప్రియాంక జార్కిహోళి ఉన్నారు. ఇక పీసీ మోహన్ బలిజ సామాజికవర్గం కాగా కోటా శ్రీనివాసపూజారి ఈడిగ సామాజికవర్గం, మైసూరు యదువీర్ యాదవ సామాజిక వర్గం, రాజశేఖర్ హిట్నాల్ కురుబ సామాజికవర్గం కాగా బ్రిజేశ్‌చౌట బంట్స్ సామాజికవర్గానికి చెందినవారు.



బెంగళూరులో అభిమానుల సంబరాలు

ఏపీలో కూటమి విజయంతో

అంబరాన్నంటిన సంబరాలు



- రాష్ట్రంలోని పలుచోట్ల ప్రవాసాంధ్రుల కేరింతలు
- తెలుగువారి సహకారం మరువలేనిది: టీడీపీ ఫోరం



జెండాలతో కార్యకర్తలు,

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూసిన ప్రవాసాంధ్రులు తెలుగుదేశం పార్టీ కూటమి విజయంతో సంబరాలు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ కూటమి తిరుగులేని మెజారిటీ సీట్లు సాధించడంతో ఆ పార్టీ అభిమానుల ఉత్సాహానికి హద్దు లేకుండా పోయింది. మారతహళ్లిలోని బెంగళూరు టీడీపీ ఫోరం కార్యాలయంతోపాటు నగర వ్యాప్తంగా తెలుగు ప్రజలు సంబరాలు చేసుకున్నారు. పలు చోట్ల బాణసంచా పేల్చి కేరింతలు కొట్టారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకుని గెలుపును ఆస్వాదించారు. బెంగళూరు టీడీపీ ఫోరం కన్వీనర్ కనకమేడల వీర ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లుగా పార్టీకోసం పనిచేస్తున్నామని అన్నారు. ఏపీలో ఐదేళ్లపాలనతో అన్ని వర్గాలు విసుగు చెందాయన్నారు. అరాచకం, హింస, దోపిడీ కొనసాగిందన్నారు. మరోసారి చంద్రబాబు సీఎం కావాలని కష్టపడి పనిచేశామని, మూడేళ్ల తర్వాత తమ ఆశయం ఫలించిందన్నారు. ఫోరం తరపున వందలాదిమంది ఐటీ ఉద్యోగులు, కార్పొరేట్ కంపెనీ ప్రముఖులు, బెంగళూరులో స్థిరపడిన వ్యాపారవర్గాల్లో నిరంతరంగా పార్టీ కోసం పనిచేశామన్నారు. ఎన్నికలకు ముందు సొంత ప్రాంతాల్లో తిరిగి ఓట్లు వేయించామన్నారు. తెలుగువారి సహకారం మరువలేనిదని అన్నారు. సహకారనగర్, బనశంకరి, యలహంక, బాణసవాడి తదితర ప్రాంతాల వాసులు కేక్ కట్ చేసుకున్నారు. కాగా ఎక్కువమంది తెలుగువారు సొంతప్రాంతాలకు వెళ్లడంతో మరికొన్ని రోజుల్లోనే ప్రత్యేక కార్యక్రమాలు జరుపుకోవాలని నిర్ణయించారు. బీజేపీ, జనసేన అభిమానులు కార్యకర్తలు సంబరాల్లో భాగస్వామ్యులయ్యారు.

యలహంకలో:

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు సందర్భంగా యలహంక కోగిలు క్రాస్‌లో బిరియాని ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. మంగళవారం సాయంత్రం సుమారు 300మందికి బిరియాని అందచేశారు. టీడీపీ జెండా ఎగురవేసి చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు. సంబరాల్లో వైవీ కృష్ణారావు, అశోక్ మేడికొండ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.





బళ్లారిలో పసుపు రంగుతో సంబరాల్లో లక్ష్మీనగర్ క్యాంపు వాసులు, అనందం వ్యక్తం చేస్తున్న ప్రవాసాంధ్రులు



యలహంకలో బిరియానీ పంపిణీ చేస్తున్న టీడీపీ అభిమానులు

బళ్లారిలో..

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అఖండ విజయం సాధించడంతో బళ్లారి, వివిధ తెలుగు క్యాంపుల్లో సంబరాలు జరుపుకున్నారు. అనంతపురం రోడ్డు, విద్యానగర్, లక్ష్మీనగర్ క్యాంపు, సిరుగుప్ప, సింధనూరు, హొస్పేట్‌లో ఉండే సీబీఎన్ అభిమానులు, ప్రవాసాంధ్రులు, క్యాంపుల్లో ఉండే తెలుగు వాళ్లు ఎన్టీఆర్, చంద్రబా బు చిత్రపటాలు ఉంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఎస్.వెంకటనాయుడు, తోరణగల్లు సురేష్, కె.నాగేంద్ర, వై.చిత్రయ్య, డి.వైకుంఠ, టి.బాబు, రఘు, వి.నాగభూషన్, సునీల్, ఎర్రిస్వామి, క్రిష్ణా, పాల్గొన్నారు. లక్ష్మీనగర క్యాంపులో టీడీపీ అభిమానులు సంబరాలు చేసుకున్నారు.


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న అంబికా లక్ష్మీనారాయణ


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న పరిటాల సునీత


ఆర్ఓ నుంచి డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న పయ్యావుల కేశవ్


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న కాలవ శ్రీనివాసులు


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న గుమ్మనూరు జయరాం


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న జేసీ అస్మిత్‌రెడ్డి


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న అమిలినేని సురేంద్రబాబు



ప్రభంజనం

ఏపీ తీర్పు @ 2024

అనంత కోటలో దగ్గుపాటి పాగా

23023 ఓట్ల మెజార్టీతో ఘన విజయం

అనంతపురం క్రైం, జూన్ 4: అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యేగా దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గెలుపొందారు. తొలి సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీలో విజయఢంకా మోగించారు. వెంటకేశ్వరప్రసాద్‌కు 1,03,334ఓట్లు, వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డికి 80,311ఓట్లు పోలయ్యాయి. కూటమి అభ్యర్థి వెంకటేశ్వర ప్రసాద్ 23023 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎంపీపీగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించి ఎమ్మెల్యేగా మరో మెట్టు ఎక్కారు. కాగా ప్రతి రౌండులోనూ దగ్గుపాటి ప్రసాద్ ఆధిపత్యం కొన సాగించడం విశేషం. పోలింగ్‌కు కేవలం 45రోజుల ముందు అనంత పురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అడుగుపెట్టిన ఆయన అతి తక్కువ సమయంలోనే టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు జనసేన, బీజేపీ కూటమి శ్రేణులతో మమేకమయ్యారు. అంద రినీ సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రచారంలో దూసుకుపోయారు. ఇదే స్థాయిలో అనంత ప్రజలు ఆయనను భారీ మెజార్టీతో గెలిపిం చారు. జేఎన్టీయూలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్‌తో డిక్లరేష న్ అందుకున్న ప్రసాద్ నగర వీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహిం చారు. ఆయన వెంట భారీగా టీడీపీ, కూటమి శ్రేణులు తరలివ చ్చాయి.



అనంత ప్రజలకు రుణపడి ఉంటా

నన్ను భారీ మెజార్టీతో గెలిపించిన అనంత పురం నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటా. ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా. ప్రజలకు ఎల్ల ప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తా. ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

గుంతకల్లు సెంటిమెంట్ యథాతథం

గుంతకల్లు, జూన్4: రాష్ట్రంలో ఏ పార్టీ గెలిస్తే అదే పార్టీ అభ్యర్థి గుంతకల్లు నియోజకవర్గంలో కూడా గెలుస్తాడన్న సెంటిమెంటు మరో సారి కొనసాగింది. టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచీ అన్ని ఎన్నిక ల్లోనూ రాష్ట్రంలో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అభ్యర్థే గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో విజయం సాధిస్తూ వస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి దాకా తొమ్మిది ఎన్నికల్లోనూ అదే సెంటిమెంటు కొనసాగింది. పదో సారి జరిగిన ఈ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో టీడీపీ, గుంతకల్లులో టీడీపీ అభ్యర్థి అయిన గుమ్మనూరు జయరాం గెలుపు సాధించారు. గుమ్మ నూరు జయరాం స్థానికుడు కాదని, ఆయన ఎమ్మెల్యే అయితే దౌర్జ న్యాలు పెరుగుతాయని వైసీపీ నాయకులు అదేపనిగా ప్రచారం చేసినా ఓటర్లు పెడచెవిన పెట్టి టీడీపీకి జైకొట్టారు. జయరాం 9300 ఓట్ల మెజారిటీతో గెలుపు సాధించారు. దీంతో మరోసారి గుంతకల్లులో సెంటిమెంటు వర్కవుట్ అయ్యింది. అలాగే ఇతర నియోజకవర్గాల నుంచి వలస వచ్చి గుంతకల్లులో టీడీపీ తరఫున ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులు మొదటి ప్రయత్నంలోనే గెలుపు సాధించిన రికార్డు కూడా ఈసారి పదిలంగా నిలిచింది. కర్నూలు జిల్లాకు చెందిన వారైన టీడీపీ నుంచి 1983లో పత్తి రాజగోపాల్, 1984లో గాదిలింగప్ప మొదటి ప్రయత్నంలోనే విజయాలను అందుకున్న వారిలో ఉన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన అరికెరి జగదీశ్ కర్నూలు జిల్లా నుంచి వచ్చి కాంగ్రెస్ తరఫున, పక్క నియోజకవర్గం నుంచి వచ్చిన వై వెంకట రామిరెడ్డి వైసీపీ తరఫున పోటీచేసి తొలి యత్నంలో విఫలం చెందారు. రెండవ ప్రయత్నంలో గెలుపు సాధించారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఇప్పటి వరకూ జరిగిన ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలుపు సాధించింది లేదు. వెంకటరామిరెడ్డి ఓటమితో ఆ రికార్డు కూడా పది లంగా నిలిచింది.

అనంత ఎంపీగా అంబికా

- 1.87లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీ



అనంతపురం అర్బన్, జూన్ 4: అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి శంకర్‌నారాయణపై 1.87 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మంగళవారం జేఎన్‌టీయూలో జరిగిన కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లోనూ ఆయన ఆధిపత్యం కనబర్చారు. చివరకు 1.87లక్షల పై చిలుకు మెజార్టీతో ఆయన విజయం సాధించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆయనకు ఎంపీగా విజయం సాధించినట్లు డిక్లరేషన్ అందజేశారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తాను ఇచ్చిన హామీ మేరకు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. కరువు జిల్లా అనంతకు కేంద్రం నుంచి విరివిగా నిధులు తెప్పించి జిల్లాను సస్యశ్యా మలం చేసేందుకు కృషి చేస్తానన్నారు.


నారా లోకేశ్‌ను అభినందిస్తున్న వెంకటరాముడు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 4: మంగళగిరిలో విజయం సాధించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తాను అభినందించినట్లు పార్టీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు తెలిపా రు. మంగళవారం మంగళగిరికి వెళ్లిన తాను లోకేశ్‌ను కలిసినట్లు తెలిపారు. యువగళం, సార్వత్రిక ఎన్నికలు, పార్టీ కార్యక్రమాల్లో తాను చేసిన కృషిని నారా లోకేశ్ ఈ సందర్భంగా అభినందించారన్నారు.

అక్కడ వైసీపీకి ఒకే ఒక్క ఓటు



హిందూపురం, జూన్ 4: పట్ట ణంలోని ముద్దిరెడ్డిపల్లి 28వ బూత్‌లో వచ్చిన ఓట్లను చూసి ఓట్లు లెక్కిస్తున్న సిబ్బందే అవాక్కయ్యారు. ఎందుకంటే ఈ బూత్‌లో వైసీపీకి ఒక్క ఓటే పడింది. టీడీపీకి 95 ఓట్లు రాగా, నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ అభ్యర్థికి 440 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి మైనార్టీ వర్గానికి చెందిన వాడు అయినా పట్టణంలో మైనార్టీ బూత్‌లలో కూడా ఎక్కడా ఆయనకు అన్ని ఓట్లు రాలేదు. అయితే ఏ ర కంగా అవగాహన కల్పించారో కానీ చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ఆయనకు 440 ఓట్లు వేశారు. వైసీపీకి మాత్రం ఒక్కటంటే ఒక్క ఓటు మాత్రం వేశారు. ఇదే బూత్ పరిధిలో అధికార పార్టీకి చెందిన నాయకుడి కుటుంబ సభ్యుల ఓట్లు ఉన్నాయి. అయినా వైసీపీకి ఇక్కడ ఒక్క ఓటు రావడం అంటే ఏమానుకోలో.. !

కాలవకు రికార్డు మెజార్టీ

రాయదుర్గం, జూన్ 4: కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు 41,659 ఓట్ల ఆధిక్యతతో గెలుపు సాధించారు. మొత్తం 2,27,784 ఓట్లు పోలవగా వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డికు 88,165 ఓట్లు వచ్చాయి. కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులుకు 1,29,307 ఓట్లు దక్కాయి. దీని ప్రకారం 41,142 ఓట్ల ఆధిక్య ఈవీఎంల ద్వారా కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులుకు దక్కింది. 1,532 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరుగగా అందులో 1002 ఓట్లు కూటమి అభ్యర్థికి, 485 ఓట్లు వైసీపీ అభ్యర్థికి వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో కూడా 517 ఓట్లు కాలవ శ్రీనివాసులు ఆధిక్యత సాధించారు. దీంతో మొత్తం ఆధిక్యత 41,659కి చేరింది. రాయదుర్గం పట్టణంలోనే కాలవ శ్రీనివాసులకు 15,981 ఓట్ల మెజార్టీ దక్కింది. డీ.హీరేహాళ్ మండలంలో 4,664, బొమ్మనహాళ్‌లో 6,689, కణేకల్లు లో 5,253, రాయదుర్గం మండ లంలో 4,150, గుమ్మఘట్ట మండలంలో 4,430 ఓట్ల ఆధిక్యత కాలవ శ్రీనివాసులుకు దక్కింది. రాయదుర్గం నియోజకవర్గంలో ఇప్పటివరకు 18 సార్లు ఎన్నికలు జరుగగా 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కాపు రామ చంద్రారెడ్డికి 32,476 ఓట్ల రికార్డు మెజార్టీ దక్కింది. ఇప్పుడు ఆ రికార్డును కాలవ శ్రీనివాసులు 41,659 ఓట్ల మెజార్టీతో బద్ధలు కొట్టారు.

నాన్న, పెదనాన్నకు సాధ్యం కాని మెజార్టీ

తాడిపత్రిటౌన్, జూన్ 4: తాడిపత్రి అసెంబ్లీ సెగ్మెంట్ ఏర్పడినప్పటి నుంచి చరిత్రలో ఎన్నడూలేనివిధంగా అత్య ధిక మెజార్టీతో టీడీపీ విజయం సాధించింది. టీడీపీ తరఫున పోటీ చేసిన జేసీ అస్మిత్ రెడ్డి తన తండ్రి, పెదనాన్నకు సాధ్యం కాని మెజార్టీని ఈ ఎన్నికల్లో సాధించారు. జేసీ అశ్మిత్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఓడిపోయినా నిరుత్సాహపడకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశాడు. పెద్దనాన్న జేసీ దివాకర్‌రెడ్డి, నాన్న జేసీ ప్రభాకర్‌రెడ్డి, సోదరుడు జేసీ పవన్‌రెడ్డి ఆశీ ర్వాదాలతో ఎన్నికల ప్రచారంలో దూసుకుపోయారు. పెద్దవడుగూరు మండలం నుంచి ఫలితాల వెల్లడి ప్రారంభమైంది. అక్కడ వైసీపీకి మెజార్టీ వస్తుందనుకున్నా టీడీపీకి మెజార్టీ రావడం గమనార్హం. గత ఎన్నికల్లో పెద్దవడుగూరు మండలంలో వైసీపీకి 6వేలకు పైగా మెజార్టీ వచ్చింది. ప్రస్తుతం అక్కడి నుంచి టీడీపీకి 400పైగా మెజార్టీ వచ్చింది. పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు, తాడి పత్రి మండలం, తాడిపత్రి పట్టణంలో ఆశించిన స్థాయిలో మెజార్టీ వచ్చింది. టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డికి 1,13,755 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి పెద్దారెడ్డికి 86024 ఓట్లు వచ్చాయి. మొత్తం పోస్టల్‌బ్యాలెట్‌తో కలిపి 29068 ఓట్ల మెజార్టీ వచ్చింది.

ప్రతి రౌండ్‌లోనూ అమిలినేనికే ఆధిక్యం

కళ్యాణదుర్గం, జూన్ 4: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు భారీ మెజార్టీతో గెలవడం పట్ల టీడీపీ కార్యకర్తలు కళ్యాణదుర్గంలో పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. ప్రతి రౌండ్‌లోను అమిలినేనికే ఆధిక్యత వచ్చింది. 19 రౌండ్‌లలోను అమిలినేనికి మెజార్టీ లభించింది. దీంతో ఆయన 37734 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు 118878 ఓట్లు పడగా, వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్యకు 81144 ఓట్లు పడ్డాయి.


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న శ్రావణిశ్రీ

శ్రావణి గెలుపులో ఆ రెండు మండలాలు..

బుక్కరాయసముద్రం, జూన్ 4: శింగనమల నియోజకవర్గంలో టీడీపీ గెలుపులో బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాలు కీలకపాత్ర పోషించినట్లు స్పష్టం అవుతోంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అత్యధికంగా బుక్కరాయసముద్రం మండలం నుంచి 6917 మెజార్టీ వచ్చింది. గార్లదిన్నె మండలం నుంచి 2350 ఓట్ల మెజార్టీ లభించింది. శింగనమల నుంచి 1972, నార్పల నుంచి 1323 ఓట్ల మెజార్టీ వచ్చింది. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వైసీపీకి 4500పైగా అధిక్యం లభించింది. ఇక పోస్టల్ బ్యాలెట్‌లో టీడీపీ కూటమి అభ్యర్థికి 580 అధిక్యత సాధించింది.

- టీడీపీ అభ్యర్థి శ్రావణీశ్రీ స్వగ్రామమైన బుక్క రాయసముద్రం మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో 772 ఓట్లు మెజార్టీ సాధించింది. దీంతో ఆ గ్రా మంలోని ప్రజలు ,టీడీపీ కార్యకర్తలు భారీగా సంబరాలు నిర్వహించారు.

ఉరవకొండలో టీడీపీ జయకేతనం

ఉరవకొండ: ఉరవకొండ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ విజయఢంకా మోగించా రు. 11మంది బరిలో నిలవగా మొత్తం 1,92,441 ఓట్లు పోల్ అయ్యాయి. 88.78శాతం పోలింగ్ నమోదైంది. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ 21,704 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పయ్యావుల కేశవ్‌కు 1,05,500ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డికి 79,746 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థికి 4,485, నోటాకి 1895 ఓట్లు వచ్చాయి. మొత్తం 15రౌండ్ల లెక్కింపులో 14 రౌండ్లు కేశవే ఆధిక్యం కనబరిచారు. ఐదో రౌండ్‌లో మాత్రమే వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డికి 147ఓట్లు అధికంగా వచ్చాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ టీడీపీ హవా కొనసాగింది. ఎన్నికల్లో విజయం సాధించిన పయ్యావుల కేశవ్‌కు ఆర్వో కేతన్‌గార్గ్ నుంచి డిక్లరేషన్ ఫాంను అందుకున్నారు. అనంతరం అనంతపురంలోని రాంనగర్‌లో ఉన్న కేశవ్ ఇంటి వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో కేశవ్ వద్ద కోలాహలం నెలకొంది.

జగన్‌కు చావుదెబ్బ



అనంతపురం విద్య, జూన్ 4: వైసీపీ అధినేత జగన్‌ను రాష్ట్ర ప్రజలు చావుదెబ్బ కొట్టారు. జగన్ ప్రభుత్వం చేసిన అవినీతి, అప్రజాస్వామిక చర్యలను, అభివృద్ధి నిరోధక చర్యలను, వైసీపీ నేతల అధికార దుర్వినియోగాన్ని ప్రజలు ఓర్చుకోలేక పోయారు. జగన్ వైఖరిని, వైసీపీ అభ్యర్థులను ఏపీ ప్రజలు వ్యతిరేకిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు హర్షణీయం. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పరుగులు పెడుతుందని ఆశిస్తున్నా.

- సీపీఐ జగదీష్

పండగే... పండగ..!



కూటమి విజయంతో కాసుల వర్షం... ధూం..ధాం చేసిన పందెంరాయుళ్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 4: ప్రజల నాడిని పసిగట్టారేమో..! లేక ప్రభుత్వ వ్యతిరేకతను అంచనా వేశారో? ఎన్నికల్లో కూటమి గెలుస్తుందని పందెం కాశారు. వారి అంచనా నిజమైంది. కాసుల వర్షం కురిసింది. దీంతో ధూం...ధాం.. చేశారు. ఇందుకు తపోవనం సర్కిల్ వేదికైంది. ఆ ప్రాంతంలో నివాసముంటున్న కూటమికి చెందిన ఓ ఐదుగురు యువకులు నెల రోజుల ముందే కూటమి గెలుస్తుందని పందెం కాశారు. అందులో కొందరు యువకులు మధ్యలో వద్దని నిరాకరించినప్పటికీ... మెయిన్ లీడ్ తీసుకున్న ఓ యువకుడు మీరు నమ్మండి కూటమే గెలుస్తుంది... లేదంటే మీ డబ్బును నేనే ఇస్తానంటూ గెలుపుపై నమ్మకం ఉంచాడు. నెలరోజులు ముందుగానే రూ. 22 లక్షలు పందెం కాసిన వారి చేతుల్లో పెట్టేశాడు. మంగళవారం విడుదలైన ఎన్నికల ఫలితాల్లో కూటమి సునామీని సృష్టించింది. దీంతో ఉదయం 11.30 గంటలకే పందెం కాసిన ప్రత్యర్థులు మొత్తం సొమ్ము విజే తలకు అందజేశారు. దీంతో ఆ యువత పట్టారాని ఆనం దంలో మునిగిపోయారు. ఓ వైపు కూటమి విజయం.. మరోవైపు బెట్టింగ్‌లో విజయం సాధించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వచ్చిన బెట్టింగ్ లాభంలో దాదాపు రూ. 4 లక్షల వరకూ ఆ యువకులతో పాటు... వారి స్నేహితులు, పరిసర ప్రాంతాల వారికి బిర్యానీ, మందు పార్టీ ఇచ్చి ధూం.. ధాం చేసినట్లు సమాచారం.

తోపుదుర్తి మీసం కొరిగించుకుంటాడా ?

పాత ఇంటర్వ్యూలోని మాటలు సోషల్ మీడియాలో వైరల్

అనంతపురం సిటీ, జూన్ 4: అధికారంలో ఉన్నప్పుడు స్పృహ లేకుండా చేసే సవాళ్లు, అధి కారం కోల్పోతే ఎంతలా ప్రత్యర్థులకు ఆయుధా లుగా మారుతాయో చెప్పే సంఘటన ఇది. కొన్ని రోజుల కిందట రాప్తాడు ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకా ష్‌రెడ్డి ఓ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రోల్ అవు తున్నాయి. ఆ ఇంటర్వ్యూలో ఆయన 2024లో జరిగే ఎన్నికల్లో ఓడిపోతే మీసం కొరిగించుకుంటా అని ఎటువంటి ఆలో చన లేకుండా అన్నారు. దీంతో ఇంటర్వ్యూ చేస్తున్న రిపోర్టర్ ఆలోచన చేసి మాట్లా డండి ఈ వీడియో రికార్డు అవుతుంది అని కూడా హెచ్చరించారు. కానీ ఆయన ఏమాత్రం ఖాతరు చేయకుండా పరిటాల సునీత ఎమ్మెల్యేగా గెలిస్తే.. మీసం తీయించుకుంటానని మరోసారి చెప్పడం అప్పట్లో సంచ లనం రేకెత్తించింది. అయితే తాజా ఎన్నికల్లో రాప్తాడు ఎమ్మెల్యేగా పరి టాల సునీత గెలవడంతో ప్రకాష్‌రెడ్డి అప్పుడు చెప్పిన మాటకు కట్టుబడి మీసం కొరిగించుకుంటారా అని టీడీపీ కార్యకర్తలు అంటున్నారు. ఈ నేపథ్యం లోనే నాటి వీడియో సోషల్ మీడి యాలో వైరల్ అవుతోంది.


ఇంటర్వ్యూలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (ఫైల్)

హిస్టరీ రిపీట్

25 ఏళ్ల తర్వాత సెంటిమెంట్‌కు బ్రేక్... 1994 ఫలితాలు పునరావృతం

ఉరవకొండ, జూన్ 4: ఉరవకొండ నియోజకవ ర్గంలో 25ఏళ్లుగా కొనసాగుతున్న సెంట్‌మెంట్‌కు బ్రేక్ పడింది. ఇక్కడ ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే, ఆపార్టీ అధికారంలోకి రాదనే సెంటిమెంట్ ఉండేది. అయితే కూటమి సునామితో ఈసారి ఆ సెంటిమెంట్ పటాపంచలైపోయింది. 1994 ఫలి తాలు 2024లో పునరావృతమయ్యా యి. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ 1994లో రాజకీయ రంగప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో శివరామిరెడ్డి కాంగ్రెస్ టిక్కెట్ ఆశించగా ఆయనకు దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ తర ఫున దరూరు పుల్లయ్య పోటీ చేశారు. ఇండిపెం డెంట్ అభ్యర్థిగా శివరామిరెడ్డి బరిలో నిలిచారు. ఆయనపైన పయ్యావుల కేశవ్ 17,691 ఓట్ల మెజా ర్టీతో గెలుపొందారు. తర్వాత 1999లో టీడీపీ అభ్య ర్థిగా పయ్యావుల కేశవ్, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా శివరామిరెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో శివరామి రెడ్డి 8వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి రాదనే సెంటిమెంట్ ఉండేది. ఆ ఎన్నికల్లో శివరామిరెడ్డి ఎమ్మెల్యేగా గెల వగా, ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి 2019వరకూ ఆ ఆనవా యితీ కొనసాగుతూనే వచ్చింది. 2004-2009 ఎన్ని కల్లో ఉరవకొండ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలుపొందగా ఆ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వర రెడ్డి గెలవగా ఆ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2019లో టీడీపీ అభ్యర్థి పయ్యా వుల కేశవ్ గెలవగా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది. దీంతో ఈ ఎన్నికల్లో ఉరవకొండలో ఏపార్టీ గెలుస్తుందో, ఆపార్టీ అధికారంలోకి రాదని అంతా భావించారు. కానీ 25ఏళ్ల తర్వాత ఆ సెంటి మెంట్‌కు బ్రేక్ పడింది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ 21,704 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.

అమెరికాలో ఎన్‌ఆర్‌ఐల సంబరాలు

పుట్లూరు, జూన్ 4: టీడీపీ కూటమి భారీ విజయంతో మండలానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు అమెరికాలోని సౌత్‌కరోలినా రాష్ట్రంలోని పార్మిల్‌సిటీలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించుకుంటూ టీడీపీకి జై కొట్టారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాప్తాడు, మడకశిర, శింగనమల నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపుతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు పురుషోత్తంచౌదరిగూడే, పొత్తూరి రవినాయుడు, వెంకట్ మాలపాటి, నరసింహ, వాసిరెడ్డి, సాచి ఆవులపాటి, వెంకట్ సూర్యదేవర, నాగేంద్ర, మధుకర్, ప్రదీప్ పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఐలు

దెబ్బకొట్టిన టీచర్లు

అనంతపురం విద్య, జూన్ 4: జగన్ ప్రభు త్వంలో ఐదేళ్లు ఇబ్బందులు పడిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఓటు ద్వారా తమ ఆగ్రహాన్ని చూపించారు. పోస్టల్ బ్యాలెట్‌తో పాటు తమ కుటుంబికుల ఓట్లు గంపగుత్తగా కూటమి అభ్యర్థులకు వేయించారు. అభ్యర్థుల మెజార్టీ చూస్తే ఇదే అర్థం అవుతోంది. 2019లో అధికారంలోని వచ్చినప్పటి నుంచి ఉపాధ్యా యులు, ఉద్యోగులే టార్గెట్ అన్నట్టుగా జగన్ వేధించారు. ఉపాధ్యాయులను కరోనా వంటి కష్ట సమయంలో కూడా నాడు-నేడు పనుల కోసం స్కూళ్లలో ఉండాలంటూ ఆదేశాలిచ్చారు. అంతేకా కుండా మద్యం దుకాణాల వద్ద కూడా కాపలాకా యించారు. అక్కడితో ఆగకుండా స్కూళ్లలో మరు గుదొడ్ల ఫొటోలు కూడా తీయించారు. ఫేషియల్ యాప్స్ అంటూ ఉదయమే పరుగులు పెట్టిం చారు. 117 జీవో అంటూ ప్రైమరీ స్కూళ్లను సైతం సర్వనాశనం చేసేలా అశాస్త్రీయమైన నిర్ణ యాలు తీసుకొచ్చాడు. ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హెచ్చరించినా...ఎవరి మాటలు వినకుండా 117 జీవోలతో ప్రైమరీ స్కూళ్లను విలీనం చేశారు. ఉపాధ్యాయులు ఎన్ని సార్లు హెచ్చరించినా వినకుండా 3,4,5 క్లాసులను విలీనం చేసి ఉపాధ్యాయులను ఒకవైపు, విద్యార్థు లను మరో వైపు అన్నట్టుగా వెంటాడారు. దీంతో ఉపాధ్యాయులు కసిగా ఎన్నికల కోసం వేచి చూశారు. ఎన్ని అవమానాలు చేసి, ఎన్నిసార్లు చీదరించినా గురువులు మౌనంగా భరిస్తూ వచ్చారు. ఎన్నికల కోసం ఎదురు చూశారు. మే మొదటివారం రాగానే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం ఉపాధ్యాయులు క్యూ కట్టారు. కనీవినీ ఎరుగని విధంగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా 26,900 ఓట్లు వేశారు. అంతే స్థాయిలో మే 13న సైతం ఉపాధ్యాయులు, వారి కుటుంబీకులు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టి.....కూటమికి జై కొట్టారు. ఫలి తాల్లో కూటమికి నేతలు విజయం సాధిస్తుంటే అయ్యవార్లు సంబరపడ్డారు. ఇదే కాదా ! మనం కోరుకుంది అంటూ సంబరపడ్డారు. జగన్‌కు టీచర్స్ దెబ్బ ఏంటో రుచి చూపించాం అంటూ ఆనందించారు.

అయ్యో..జొకో

గాయంతో ఫ్రెంచ్ ఓపెన్ నుంచి అవుట్

సెమీస్‌కు గాఫ్, స్వియటెక్




పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అనూహ్య పరిణామం. 25వ గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న పురుషుల డిఫెండింగ్ చాంప్, వరల్డ్ నెంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ టోర్నీ నుంచి వైదొలిగాడు. కుడి మోకాలి గాయం కారణంగా జొకో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఆడడం లేదని నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. ఫ్రాన్సిస్కోతో జరిగిన ప్రీక్వార్టర్స్ పోరును అతికష్టమ్మీద నెగ్గిన జొకోవిచ్.. ఆ మ్యాచ్‌లో పలుమార్లు ఇబ్బందిపడ్డాడు. ఈ క్రమంలో నొప్పితోనే ఆ మ్యాచ్‌ను కొనసాగించిన జొకో.. చివరకు ఐదుసెట్లు పాటు పోరాడి గట్టెక్కాడు. మ్యాచ్ తర్వాత ఎమ్ఆర్ఐ స్కానింగ్ తీయించగా, గాయమైనట్టు బయటపడింది. దీంతో జొకోతో క్వార్టర్‌ఫైనల్స్‌లో తలపడాల్సిన కాస్పర్ రూడ్ వాకోవర్‌తో నేరుగా సెమీఫైనల్ చేరాడు. క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించడంతో జొకోవిచ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తన నెంబర్‌వన్ స్థానాన్ని రెండోసీడ్ జానిక్ సిన్నర్‌కు కోల్పోనున్నాడు. ఇక, సిన్నర్ 6-2, 6-4, 7-6(3)తో దిమిత్రోవ్‌ను చిత్తుచేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లగా.. జ్వెరెవ్ 4-6, 6-1, 5-7, 7-6(2), 6-2తో హోల్గర్ రూన్‌ను ఓడించి క్వార్టర్స్ చేరాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ స్వియటెక్, మూడోసీడ్ కొకొ గాఫ్ సెమీఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. క్వార్టర్‌ఫైనల్స్‌లో స్వియటెక్ 6-0, 6-2తో ఐదోసీడ్ వొండ్రుసోవాను ఓడించగా.. గాఫ్ 4-6, 6-2, 6-3తో 8వ సీడ్ జెబ్యూర్‌పై విజయం సాధించింది.

వేటకు వేళాయె!

టీ20 ప్రపంచకప్‌లో తొలి పోరుకు భారత్ సై

నేడు ఐర్లాండ్‌తో ఢీ

రాత్రి 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



రోహిత్

న్యూయార్క్: భారత క్రికెట్ అభిమానులంతా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న తరుణం రానేవచ్చింది. టీ20 ప్రపంచకప్ గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం తమ తొలి మ్యాచ్‌ను ఐర్లాండ్‌తో ఆడనుంది. 2007లో తొలి ప్రపంచకప్‌ను అందుకున్నాక భారత జట్టుకు ఈ మెగా టోర్నీ ఊరిస్తూనే ఉంది. కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీలాంటి అనుభవజ్ఞులు.. సూర్యకుమార్, పంత్, బుమ్రాలాంటి యువ ఆటగాళ్ల సహకారంతో ఈసారైనా కప్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఇక తాజా టోర్నీలో చిన్న జట్లు అద్భుతంగా పోరాడుతున్న సమయంలో ఐర్లాండ్‌ను తక్కువగా అంచనా వేయడానికి లేదు. అలాగే ఈ జట్టుకు గతంలో పెద్ద జట్లకు షాకిచ్చిన అనుభవం కూడా ఉంది. ఆసీస్‌లో జరిగిన చివరి వరల్డ్‌కప్‌లో ఈ జట్టు ఇంగ్లండ్‌ను ఓడించింది. అలాగే ఇటీవల పాక్‌ను కూడా మట్టికరిపించింది. బల్బిర్నీ, స్టిర్లింగ్, వికెట్ కీపర్ టక్కర్‌లతో పాటు పేసర్ జోషువా లిటిల్ జట్టులో కీలక ఆటగాళ్లు. అటు స్థానిక నసౌ కౌంటీ క్రికెట్ స్టేడియంలో డ్రాప్ ఇన్ పిచ్ ఎలా స్పందిస్తుందనేది ఇరు జట్లకు సవాల్‌గా మారింది. ఐపీఎల్ మాదిరి ఇక్కడ బ్యాటర్లు చెలరేగుదామనుకుంటే బోర్లా పడక తప్పదు. మంగళవారం దక్షిణాఫ్రికా-శ్రీలంక మధ్య జరిగిన మ్యాచ్ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఐర్లాండ్‌తో ఆడిన ఏడు టీ20ల్లోనూ భారత్ గెలిచింది.

ఓపెనింగ్ ఎవరో?: ఈ టోర్నీలో భారత్ ఓపెనర్లుగా ఎవరిని బరిలోకి దింపుతారనేది చర్చనీయాంశంగా మారింది. కోచ్ ద్రవిడ్ ఈ విషయమై స్పష్టత ఇవ్వకపోయినా.. రోహిత్‌కు జతగా కోహ్లీని ఆడించే అవకాశం ఉంది. అలా జరిగితే జైస్వాల్ బెంచీకే పరిమితమవుతాడు. ఐపీఎల్ ఫామ్‌ను విరాట్ ఇక్కడా కొనసాగిస్తే జట్టుకు లాభమే. వికెట్ కీపర్‌గా పంత్ ఆడడం ఖాయమే. సూర్యకుమార్‌తో పాటు శివమ్ దూబే, హార్దిక్ మిడిలార్డర్‌లో రానున్నారు. ఇక్కడి పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండడంతో లెఫ్టామ్ స్పిన్నర్లు జడేజా, అక్షర్‌లతో పాటు కుల్దీప్‌ను సైతం ఆడించనున్నారు. అయితే బుమ్రాకు జతగా రెండో పేసర్‌గా సిరాజ్, అర్ష్‌దీప్‌లలో ఎవరిని ఎంపిక చేయాలనే డైలమాలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. హార్దిక్ మూడో పేసర్‌గా సేవలందించనున్నాడు.



స్టిర్లింగ్

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్.

ఐర్లాండ్: బల్బిర్నీ, స్టిర్లింగ్ (కెప్టెన్), టక్కర్, టెక్టర్, కాంఫర్, డాక్‌రెల్, డిలానీ, అడెయిర్, మెక్‌కార్తి, యంగ్, లిటిల్.

పిచ్, వాతావరణం: పిచ్ స్పందనపై అనిశ్చితి కొనసాగుతోంది. చివరి మ్యాచ్‌లో శ్రీలంక 77 పరుగులకు కుప్పకూలింది. అటు సఫారీలు కూడా ఇబ్బందిపడ్డారు. స్పిన్, పేస్‌కు కూడా అనుకూలించడం సానుకూలాంశం.

ప్రణయ్‌కు రజావత్ షాక్

'ఇండోనేసియా'లో గాయత్రి జోడీ ముందంజ

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ హెచ్ఎస్ ప్రణయ్‌కు చుక్కెదురైంది. భారత్‌కే చెందిన యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ 21-17, 21-12తో మాజీ వరల్డ్ నెంబర్‌వన్ ప్రణయ్‌కు షాకిచ్చి రెండోరౌండ్ చేరాడు. మరో ఆరంభ రౌండ్ పోరులో లక్ష్యసేన్ 21-12, 21-17తో కెంటా సునెయామ (జపాన్)ను ఓడించాడు. ఇతర భారత షట్లర్లలో మహిళల డబుల్స్ ద్వయం గాయత్రి/ట్రీసా జాలీ, మిక్స్‌డ్ జోడీ సుమిత్/సిక్కి రెడ్డి ప్రత్యర్థులపై గెలిచి రెండోరౌండ్లో ప్రవేశించారు.

విహారికి ఎన్‌ఓసీ!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ జట్టు ఎంపికపై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)-క్రికెటర్ హనుమ విహారి మధ్య గత సీజన్‌లో జరిగిన వివాదం గుర్తుందిగా! అప్పటి నుంచి తాను వేరే రాష్ట్రానికి ఆడతానని, ఇందుకోసం ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) ఇవ్వాలంటూ రెండు నెలల్లో విహారి నాలుగుసార్లు ఈమెయిల్స్ పంపించినా స్పందించని ఏసీఏ.. ఏపీలో ఎన్నికల ఫలితాల్లో వైసీపీ పార్టీ ఘోరంగా ఓడడంతో ఒక్కసారిగా దిగొచ్చింది. ఈనెల 3వ తేదీన ఎన్‌ఓసీ జారీ చేసినట్టు లేఖ తయారు చేసి, విహారికి పంపించింది. కాగా, ఏపీ ఎన్నికల్లో గెలిచిన ఎన్డీఏ కూటమికి 'ఎక్స్'లో అభినందనలు తెలిపిన విహారి.. 'కర్మ ఎవరినీ ఉపేక్షించదు' అని పోస్ట్ చేయడం గమనార్హం.

ఐదేసిన ఫరూఖీ

● అఫ్ఘానిస్థాన్ శుభారంభం
● 125 పరుగులతో ఉగాండా చిత్తు



ప్రొవిడెన్స్ (గయానా): టీ20 వరల్డ్‌కప్‌ను అఫ్ఘానిస్థాన్ ఘన విజయంతో ఆరంభించింది. రహ్మానుల్లా గుర్బాజ్ (76), ఇబ్రహీం జద్రాన్ (70) అర్ధ శతకాలతోపాటు పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీ (5/9) ఐదు వికెట్లతో విజృంభించడంతో.. గ్రూప్-సిలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అఫ్ఘాన్ 125 పరుగుల తేడాతో ఉగాండాను చిత్తు చేసింది. తొలుత అఫ్ఘాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసింది. కాస్మాస్, మసాబా చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఉగాండా 16 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. రాబిన్సన్ ఒబుయా (14), రియాజత్ అలీ షా (11) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్లు చేశారు. రషీద్, నవీనుల్ చెరో 2 వికెట్లు తీశారు.

బిజినెస్

మదుపరి షాక్.. సూచీలు షేక్



'పోల్' పంచ్‌కు రక్తమోడిన దలాల్‌స్ట్రీట్

- ఒకదశలో 6,234 పాయింట్లు పతనమై 70,000 స్థాయికి జారుకున్న సెన్సెక్స్
- చివరికి 4,390 పాయింట్ల నష్టంతో 72,079 స్థాయి వద్ద ముగిసిన సూచీ
- ఇంట్రాడేలో నిఫ్టీ దాదాపు 2,000 పాయింట్లు డౌన్
- చివర్లో 1,379 పాయింట్ల నష్టంతో 21,885 వద్ద క్లోజ్
- గడిచిన నాలుగేళ్లలో ఇదే అతిపెద్ద మార్కెట్ పతనం
- ఒకదశలో దాదాపు రూ.40 లక్షల కోట్ల సంపద ఉఫ్
- రూ.31 లక్షల కోట్ల నష్టంతో రూ.394.83 లక్షల కోట్లకు పడిపోయిన బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్

ముంబై: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు స్టాక్ మార్కెట్‌ను భారీగా కుదిపేశాయి. ఎన్డీఏకు సీట్లు 300 కంటే తగ్గడంతోపాటు బీజేపీకి పూర్తి మెజారిటీ లభించకపోవడం మార్కెట్ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇన్వెస్టర్లు అమ్మకాలు పోటెత్తించడంతో మంగళవారం సూచీలు కుప్పకూలాయి. నాలుగేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. దాంతో ఎగ్జిట్ పోల్స్ జోష్‌తో సోమవారం ఆర్జించిన లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఒకదశలో 6,234.35 పాయింట్ల (8.15 శాతం) వరకు క్షీణించి దాదాపు 5 నెలల కనిష్ఠ స్థాయి 70,234.43 వద్దకు పడిపోయింది. ఆ తర్వాత కాస్త కోలుకున్న సూచీ.. చివరికి 4,389.73 పాయింట్ల (5.74 శాతం) నష్టంతో రెండు నెలలకు పైగా కనిష్ఠ స్థాయి 72,079.05 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 1,982.45 పాయింట్లు (8.52 శాతం) పతనమై 21,281.45 వద్దకు పడిపోయింది. ట్రేడింగ్ నిలిచేసరికి సూచీ 1,379.40 పాయింట్ల (5.93 శాతం) నష్టంతో 21,884.50 వద్ద స్థిరపడింది. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో 2020 మార్చి 23న సెన్సెక్స్, నిఫ్టీ 13 శాతం మేర క్షీణించాయి. ఆ తర్వాత సూచీలకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు నష్టం. అమ్మకాల సునామీలో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.31 లక్షల కోట్లకు పైగా హరించుకుపోయి రూ.394.83 లక్షల కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఒకదశలోనైతే మార్కెట్ సంపద దాదాపు రూ.40 లక్షల కోట్ల మేర ఆవిరైంది.

మోదీ సర్కారు హయాంలో నిఫ్టీ అతిపెద్ద నష్టాలు

తేదీ	నష్టం పాయింట్లు	శాతం
2024 జూన్ 4	1,379.40	5.93
2022 ఫిబ్రవరి 22	531.95	3.06
2021 నవంబరు 26	509.80	2.91
2021 ఏప్రిల్ 12	524.05	3.53
2021 ఫిబ్రవరి 26	568.20	3.76
2020 మార్చి 23	1,135.20	12.98
2020 మార్చి 16	757.80	7.61
2020 మార్చి 12	868.25	8.30
2020 మార్చి 9	538.00	4.90

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా లేకపోవడంతో ఇన్వెస్టర్లు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, పవర్, యుటిలిటీస్, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో భారీగా లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. పలు ప్రభుత్వ రంగ షేర్లు పరిమితికి మించి పతనమవడంతో వాటిల్లో ట్రేడింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 27 నష్టపోయాయి. ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ షేరు 15 శాతానికి పైగా క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్ సైతం రెండంకెల స్థాయిలో నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ రంగ దిగ్గజం హెచ్‌యూఎల్ మాత్రం 6 శాతం లాభపడి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. నెస్లే ఇండియా 3 శాతానికి పైగా పెరిగింది.
- బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 8.07 శాతం క్షీణించగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 6.79 శాతం నష్టపోయింది. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా రంగాల సూచీలన్నీ నేలచూపులు చూశాయి. యుటిలిటీస్ 14.40 శాతం, పవర్ 14.25 శాతం పతనమవగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 13.07 శాతం, సర్వీసెస్ 12.65 శాతం, క్యాపిటల్ గూడ్స్ 12.06 శాతం, ఎనర్జీ 11.62 శాతం నష్టపోయాయి.
- బీఎస్ఈలో 3,934 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,349 కంపెనీల స్టాక్ నష్టాలు చవిచూశాయి. 488 మాత్రం లాభపడ్డాయి. 97 యథాతథంగా ముగిశాయి. కాగా, 292 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోగా.. 139 ఏడాది గరిష్ఠాన్ని చేరాయి.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 37 పైసలు క్షీణించి 83.51 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయంగా డాలర్ బలపడటం ఇందుకు కారణమైంది.

అదానీ షేర్లు ఢమాల్ : నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహిత కార్పొరేట్ ప్రముఖుడిగా పేరున్న గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ షేర్లు మహా పతనాన్ని చవిచూశాయి. ఇంట్రాడేలో అదానీ పోర్ట్స్ 25 శాతం వరకు క్షీణించింది. పలు కంపెనీల షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. దాంతో గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ సంపద ఒక్కరోజులోనే రూ.3.64 లక్షల కోట్లు తగ్గి రూ.15.78 లక్షల కోట్లకు పడిపోయింది.

పీఎస్‌యూ స్టాక్స్ పరేషాన్ : ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ), ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల(పీఎస్‌బీ) షేర్లు భారీగా కుదేలయ్యాయి. ఆర్ఈసీ షేరు ఏకంగా 24.07 శాతం క్షీణించగా.. పీఎఫ్‌సీ 21.62 శాతం, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 19.43 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 19.21 శాతం, ఓఎన్‌జీసీ 16.23 శాతం, కోల్ ఇండియా 13.54 శాతం, ఎన్‌టీపీసీ 14.52 శాతం నష్టపోయాయి. దాంతో నిఫ్టీ పీఎస్ఈ ఇండెక్స్ 16.38 శాతం పతనమై 9,475 స్థాయికి జారుకుంది. పీఎస్‌బీలదీ అదే పరిస్థితి. యూనియన్ బ్యాంక్ 17.65 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 15.15 శాతం చొప్పున నష్టపోయాయి. కెనరా బ్యాంక్ 13.45 శాతం, ఎస్‌బీఐ 13.37 శాతం తగ్గాయి. దాంతో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 15.14 శాతం దిగజారి 6,794.25 వద్దకు పడిపోయింది. పీఎస్‌బీలతోపాటు ప్రైవేట్ బ్యాంక్‌లూ భారీ నష్టాలను చవిచూశాయి. దాంతో నిఫ్టీ బ్యాంక్ సూచీ 7.95 శాతం క్షీణించి 46,928.60 వద్దకు జారుకుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,870 ▲	66,800 ▲	98,500 ▲
ముంబై	71,969 ▲	65,924 ▲	88,837 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	450
వరంగల్	482	గోదావరి	445
చిత్తూరు	563	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	147	విజయవాడ	149
వరంగల్	147	గుంటూరు	149
కరీంనగర్	147	ఒంగోలు	149
మహబూబ్‌నగర్	147	చిత్తూరు	142
కర్నూలు	147	నెల్లూరు	142
విశాఖపట్నం	135	అనంతపురం	149
గోదావరి	149		



పవన్‌కల్యాణ్‌కు సినీ ప్రముఖుల అభినందనలు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమితో పొత్తు కుదుర్చుకున్న పవన్ కల్యాణ్.. పిఠాపురంలో ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాలలోనూ(21) జయకేతనం ఎగురవేశారు. ఈ నేపథ్యంలో పవన్‌కు పలువురు టాలీవుడ్ సెలబ్రిటీల నుంచి అభినందలు వెల్లువెత్తాయి. "ఎవ్వరికి అందదు అతని రేంజ్.. రెప్ప తెరిచేను రగిలే రివెంజ్" అని పేర్కొంటూ.. 'ఓజీ టైమ్ బిగిన్స్ అనే ఓ సినిమా పోస్టర్‌ను నిర్మాణ సంస్థ డివివి మూవీస్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, హీరోలు బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరికి హృదయపూర్వక అభినందనలు" అని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, నిర్మాతల మండలి పేర్కొంది. మరోవైపు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకి మోహన్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇంతటి ఘనవిజయం అందుకున్న నారా చంద్రబాబునాయుడుకు నా హృదయపూర్వక అభినందనలు. మీ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందని .. ఉన్నత శిఖరాలను చేరుకుంటుందని విశ్వసిస్తున్నాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఒక అన్నగా గర్వంగా ఉంది



"డియర్ కల్యాణ్ బాబూ ..ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను, తగ్గావని ఎవరు అనుకున్నా అది ప్రజలని గెలిపించటానికే అని నిరూపించిన నిన్ను చూస్తుంటే ఒక అన్నగా గర్వంగా వుంది. నువ్వు గేమ్‌చేంజర్‌వి మాత్రమే కాదు, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌'వి కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది.
- చిరంజీవి

హృదయపూర్వక శుభాకాంక్షలు

చిరస్మరణీయమైన విజయం అందుకున్న పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రజలకు నిరంతరం సేవ చేయాలన్న మీ కృషి, అంకితభావం, నిబద్ధత హృదయాన్ని హత్తుకునేలా ఉంటాయి. మీ కొత్త రాజకీయ ప్రయాణానికి అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను. - అల్లుఅర్జున్

మీ గెలుపు స్ఫూర్తిదాయకం

రీల్ లైఫ్‌లోనూ.. రియల్ లైఫ్‌లోనూ అసలు సిసలు హీరో అయిన పవన్ కల్యాణ్‌కు అభినందనలు. ఈ గెలుపు కోసం మీరు చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకంగా.. ఓ పాఠంలా ఉంది. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. - నాని

చరిత్రను సృష్టించారు

ఓ అభిమానిగా.. ఓ సోదరుడిగా నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల్లో చరిత్రను సృష్టించారు. మీ సత్తాతో కూటమిని నిలబెట్టారు. ఈ విజయానికి మీరు అర్హులు. మీరెప్పటికీ మా పవర్‌స్టారే. - నితిన్

తగిన ప్రతిఫలం దక్కింది

శుభాకాంక్షలు పవన్ కల్యాణ్. మీ కృషికి, అంకితభావానికి తగిన ప్రతిఫలం దక్కింది. - కాజల్ అగర్వాల్

ఓం బిర్లా రికార్డ్

» స్పీకర్‌గా చేసి మళ్లీ ఎంపీగా ఎన్నిక

న్యూఢిల్లీ, మే 4: లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన స్పీకర్ ఓం బిర్లా ఓ రికార్డ్ సాధించారు. స్పీకర్‌గా చేసి మళ్లీ లోక్‌సభకు ఎన్నికైన నేతగా నిలిచారు. గత 20 ఏళ్లలో ఈ ఘనత సాధించింది ఓం బిర్లానే. గతంలో కాంగ్రెస్‌కు చెందిన పీఏ సంగ్మా 1996లో లోక్‌సభ స్పీకర్‌గా చేసి, 1998లో మేఘాలయా రాష్ట్రంలోని తురా నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత ఈ ఫీట్ సాధించింది ఓం బిర్లానే. 1999లో ఏపీలోని అమలాపురం నుంచి టీడీపీ తరఫున గెలిచిన జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2002లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. బాలయోగి అనంతరం స్పీకర్‌గా ఎన్నికైన శివసేన నేత మనోహర్ జోషి.. 2004లో ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి.. కాంగ్రెస్ అభ్యర్థి ఎక్‌నాథ్ గైక్వాడ్ చేతిలో ఓడిపోయారు. 2004లో బోల్‌పూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన సీపీఎం నేత సోమ్‌నాథ్ చటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2009లో సీపీఎంతో విభేదాలు రావడంతో ఆయన రాజకీయాల నుంచి నిష్క్రమించారు. 2009లో బిహార్‌లో ససరామ్ నియోజకవర్గం నుంచి గెలిచిన కాంగ్రెస్ సభ్యురాలు మీరా కుమార్ 15వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఓడిపోయారు. 2014లో స్పీకర్‌గా ఎన్నికైన బీజేపీ నాయకురాలు సుమిత్రా మహాజన్.. 2019 ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ తర్వాత 2019లో స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లా.. ఇప్పుడు మళ్లీ ఎంపీగా గెలిచి రికార్డు సృష్టించారు.

ఇండియా కొంప ముంచిన స్నేహపూర్వక పోటీ!

లేకుంటే కాంగ్రెస్ ఖాతాలో మరికొన్ని సీట్లు

» ఉమ్మడి అభ్యర్థులున్న చోట ఘన విజయం
» హిందీబెల్ట్‌లో ఫలించిన కాంగ్రెస్ వ్యూహం
» మిత్రుల పోటీతో పంజాబ్, బెంగాల్‌లో నష్టం



సురేష్ గోపి

"బీజేపీని దెబ్బతీయాలంటే.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలి. మనలో మనం పోటీ పడకూడదు.." గత ఏడాది జూలై 17న బెంగళూరులో జరిగిన ఇండియా కూటమి(40 పార్టీలు) సమావేశంలో సూత్రప్రాయంగా తీసుకున్న నిర్ణయం ఇది.! ఆ తర్వాత ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబైలో జరిగిన సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చ జరిగింది.! క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాలేదు. 'స్నేహపూర్వక పోటీ'ని కూటమి పక్షాలు ప్రకటించుకున్నాయి. ఇప్పుడు ఆ స్నేహపూర్వక పోటీలే కూటమి కొంప ముంచాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మిత్రుల మధ్య పోటీతో నష్టం

ఇండియా కూటమిలోని వంచిత్ బహుజన్ అఘాడీ వంటి పలు చిన్న పార్టీలు కొన్ని చోట్ల కాంగ్రెస్‌పై తమ అభ్యర్థులను నిలిపాయి. వీటి ద్వారా కొంత మేర నష్టం జరగ్గా.. కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్‌లలో మాత్రం పూడ్చలేని నష్టం వాటిల్లింది. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉంటే.. కాంగ్రెస్ కూటమికి ఈ మూడు రాష్ట్రాల్లో అదనంగా 11-16 సీట్లు వచ్చి ఉండేవని తాజా ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ స్నేహపూర్వక పోటీ పంజాబ్‌లో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు విజయాన్ని కట్టబెట్టింది. ఖదూర్‌సాహిబ్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థికి 3.76 లక్షల ఓట్లు రాగా.. అక్కడి ఆప్-కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు మొత్తం 5.25 లక్షలకు పైనే..! ఫరీద్‌కోట్‌లో కూడా 2.96 లక్షలతో ఇండిపెండెంట్ అభ్యర్థి అగ్రస్థానంలో నిలవగా.. అక్కడ కాంగ్రెస్, ఆప్‌కు వచ్చిన ఓట్ల మొత్తం 3.8 లక్షలు. బఠిండాలో శిరోమణి అకాలీదళ్ 3.75లక్షలతో విజయం సాధించగా.. అక్కడ కూడా ఆప్-కాంగ్రెస్‌లకు వచ్చిన ఓట్ల సంఖ్య 5.25 లక్షలు. పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమిలోని టీఎంసీ, కాంగ్రెస్, సీపీఎం పరస్పర పోటీ వల్ల 8-10 సీట్లలో బీజేపీ పాగా వేసింది. ఇక్కడ కూడా బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లతో పోలిస్తే.. విడివిడిగా కూటమికి వచ్చిన ఓట్ల సంఖ్య చాలా ఎక్కువ కావడం గమనార్హం..! కేరళలోని త్రిషూర్ నియోజకవర్గం నుంచి నటుడు, బీజేపీ అభ్యర్థి సురేశ్‌గోపీ ఘనవిజయం సాధించారు. అక్కడ కమ్యూనిస్టులకు, కాంగ్రెస్‌కు వచ్చిన మొత్తం ఓట్ల కంటే.. సురేశ్‌గోపీ సాధించిన ఓట్లు దాదాపు 2.06 లక్షల మేర తక్కువ కావడం గమనార్హం. కేరళలో కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో చాలా వరకు కమ్యూనిస్టులే రెండో స్థానంలో ఉన్నారు. అక్కడ విడివిడిగా పోటీచేయకుండా ఉండిఉంటే.. భారీ మెజారిటీ వచ్చేదనేది నిర్వివాదాంశం.

ఆ రాష్ట్రాల్లో గ్రాండ్ సక్సెస్..!

ప్రీపోల్ సర్వేలు మొదలు.. ఎగ్జిట్ పోల్స్ దాకా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ హవా అంటూ ఫలితాలొచ్చాయి. మంగళవారం నాటి ఫలితాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. 80 స్థానాలున్న యూపీలో ఇండియా కూటమిదే పైచేయి అయ్యింది. 2014లో 77, 2019లో 62 సీట్లను సాధించిన బీజేపీ ఈ సారి 33 స్థానాలకే పరిమితమైంది. ఇందుక్కారణం.. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉండడమే..! బీజేపీ అధికారంలో ఉన్న యూపీలో ఈ ప్రయోగంతో గ్రాండ్ సక్సెస్ అయినట్లే. అంతే కాదు.. మహా వికాస్ అఘాడీ పేరుతో ముందు నుంచి కూటమిగా ఉన్న కాంగ్రెస్, ఎన్‌సీపీ(శరద్ వర్గం), శివసేన(ఉద్ధవ్ వర్గం) 48 లోక్‌సభ స్థానాలున్న మహారాష్ట్రలోనూ 'ఉమ్మడి' ధర్మాన్ని పాటించాయి. ఫలితంగా 29 స్థానాల్లో ఘనవిజయం సాధించాయి. రాజస్థాన్, ఝార్ఖండ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోనూ ఈ ప్రయోగం ఫలించింది. హిందీబెల్ట్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్ మినహా.. ఇండియా కూటమి మంచి ఫలితాలను సాధించింది. గత ఎన్నికల్లో ఈ బెల్ట్‌లో బీజేపీ ఏకపక్ష హవా కొనసాగిన విషయం తెలిసిందే..!

- సెంట్రల్ డెస్క్

భారీగా పుంజుకున్న కాంగ్రెస్

2014, 2019 ఎన్నికలతో పోలిస్తే.. కాంగ్రెస్ ఈసారి పుంజుకుంది. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ ఒంటరిగా 99 స్థానాల్లో విజయం సాధించింది. నిజానికి 2014లో 44 సీట్లు.. 2019లో 52 స్థానాలను మాత్రమే సాధించిన కాంగ్రెస్.. లోక్‌సభలో విపక్ష పార్టీ హోదాను కూడా దక్కించుకోలేదు. ఓ దశలో బీజేపీ దూకుడుతో క్రమంగా కాంగ్రెస్ కనుమరుగవుతోందా? అనే అనుమానాలు రాజకీయవర్గాల నుంచి వ్యక్తమైన నేపథ్యంలో.. రాహుల్‌గాంధీ రెండుసార్లు చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'లు ప్రజల్లో మళ్లీ ఆదరణను తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా దక్షిణాదిన కేరళలో తిరిగి తన సత్తాను చాటుకోగా.. హిందీబెల్ట్‌లో ఆశించిన స్థాయిలో పురోగతిని నమోదు చేసుకుంది. వచ్చే ఎన్నికల్లోగా ఆ పార్టీ మరింత వేగంగా పుంజుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోక్‌సభకు రామాయణ్ రాముడు.. రచన.. కంగన..

ఎన్నికల్లో వివిధ పార్టీల తరఫున మెరిసిన తారలు



న్యూఢిల్లీ, జూన్ 4: లోక్‌సభ ఎన్నికల్లో తారలు తళుక్కుమన్నారు. రామానంద్ సాగర్ రామాయణ్‌లో శ్రీరాముడి పాత్రధారి, బాలీవుడ్ నటుడు అరుణ్ గోవిల్ తొలిసారిగా చట్టసభలో అడుగుపెట్టనున్నారు. యూపీలోని మేరఠ్ నుంచి పోటీచేసిన ఆయన ఎస్పీ అభ్యర్థి సునీతా వర్మపై 9,366 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ సినీనటి, తెలుగులో 'కన్యాదానం', 'మావిడాకులు', 'నేను ప్రేమిస్తున్నాను' వంటి చిత్రాల్లో నటించిన రచనా బెనర్జీ టీఎంసీ తరఫున విజయం సాధించారు. బెంగాల్‌లోని హుగ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె 74,048 ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని జాదవ్‌పూర్ నుంచి టీఎంసీ నుంచే బరిలో నిలిచిన బెంగాలీ సినిమా, టీవీ నటి సయానీ ఘోష్ 2.50 లక్షల ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపొందారు. ఇప్పటికే ఓసారి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ మలయాళీ నటుడు సురేశ్ గోపీ కేరళలోని త్రిషూర్‌లో విజయం సాధించి, లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి స్థానం నుంచి బీజేపీ నుంచి రేసులో నిలిచిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ 74,755 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన భోజ్‌పూరి నటుడు మనోజ్ తివారీ సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి కన్హయ్య కుమార్‌పై 1,22,135 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని అసన్సోల్ స్థానం నుంచి పోటీ చేసిన సిటింగ్ ఎంపీ, ఈసారి కాంగ్రెస్ తరఫున పోటీచేసిన బాలీవుడ్ సీనియర్ నటుడు శతృఘ్న సిన్హా, బీజేపీ అభ్యర్థి సురేంద్రజీత్‌పై విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి హేమామాలిని యూపీలోని మథుర స్థానం నుంచి 2.91లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రముఖ నటుడు, యూపీలోని గోరఖ్‌పూర్ సిటింగ్ ఎంపీ, రేసుగుర్రం సినిమాలో ప్రతినాయకుడు రవికిషన్(రవీంద్ర శుక్లా).. ఎస్పీ అభ్యర్థి కాజల్ నిషాద్‌పై లక్ష పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. బెంగాల్‌లోని ఘటల్ నుంచి పోటీ చేసిన తృణమూల్ సిటింగ్ ఎంపీ, సినీనటుడు దీపక్ అధికారి బీజేపీ అభ్యర్థి హిరణ్మయి చటోపాధ్యాయపై 1.75 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అయితే భోజ్‌పురీ నటుడు, నేపథ్య గాయకుడు పవన్ సింగ్‌కు బిహార్‌లోని కరాకట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఓటమిపాలయ్యారు. యూపీలోని ఆజంఘడ్ నుంచి భోజ్‌పురీ నటుడు దినేశ్ లాల్ యాదవ్ ఎస్పీ అభ్యర్థి ధర్మేంద్రయాదవ్ చేతిలో 1.6 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. టీవీ నటిగా, మోడల్‌గా గుర్తింపు పొంది రాజకీయాల్లోకి అడుగుపెట్టిన స్మృతీ ఇరానీ.. అమేఠీ నుంచి పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో 1.62 లక్షల ఓట్లతో ఓడిపోయారు. తమిళనాడులోని విరుద్‌నగర్ నుంచి బీజేపీ తరఫున పోటీచేసిన నటి రాధిక, అమరావతి నుంచి పోటీ చేసిన నవనీత్‌కౌర్ ఓడిపోయారు.

సందేశ్‌ఖాలీలో బీజేపీ ఓటమి

కోల్‌కతా, మే 4: సందేశ్‌ఖాలీ.. గత కొన్ని రోజులుగా వార్తల్లో విపరీతంగా వైరల్ అయిన స్థానం.. బెంగాల్ బీజేపీ నేతలు ఎక్కువగా ప్రస్తావించిన పేరిది.. ఈ నియోజకవర్గానికి చెందిన ఓ మహిళను టీఎంసీ నాయకులు లైంగికంగా వేధించారంటూ బీజేపీ పలు ఆందోళనలు చేసింది. కానీ, ఇవేవీ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లను రాల్చలేదు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బశీర్‌హాట్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో సందేశ్‌ఖాలీ కూడా ఒకటి. ఈ నియోజకవర్గంలో బీజేపీ దారుణ పరాజయాన్ని చవిచూసింది. బీజేపీ అభ్యర్థి రేఖా పాత్రను టీఎంసీ అభ్యర్థి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు హాజీ నూరుల్ ఇస్లాం దాదాపు రెండు లక్షల ఓట్ల తేడాతో ఓడించారు. ఈ సందర్భంగా హాజీ నూరుల్ ఇస్లాం మాట్లాడుతూ.. "నా విజయంతో సందేశ్‌ఖాలీ గురించి ప్రచారం చేసినవన్నీ అబద్ధాలేనని తేలిపోయింది. ప్రజలెవరూ వాటిని నమ్మలేదు. వైరల్ చేసిన వీడియోల వెనుక బీజేపీ పాత్ర ఉందని వారు భావించారు. అందుకే బీజేపీ పన్నిన కుట్రకు నా విజయంతో చక్కటి సమాధానం చెప్పారు" అని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పదును చూపిన ప్రజల విజ్ఞత

ఉత్కంఠకు, ఆకాంక్షలకు తగ్గట్టుగానే, ఎన్నికల ఫలితాలు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఉక్కుపాదాల నుంచి, ఉక్కపోతల నుంచి, దుష్పరిపాలనల నుంచి ఉపశమనం కలిగించాయి. ఆగ్రహానికి, నిరాదరణకు పాత్రులైన నాయకులను, వారి ప్రభుత్వాలను నిర్దాక్షిణ్యంగా ప్రజారంగం నుంచి నెట్టివేశాయి. తిరుగులేని, ఎదురులేని నాయకులనుకున్న వారి ఒడ్డూపొడుపూ కత్తిరించి బుద్ధి చెప్పాయి. 2024 ప్రజల తీర్పు భారత రాజకీయరంగాన్ని తిరిగి సంచలనశీలంగా మార్చింది. పదేళ్ల ఏకపక్ష పాలన స్థానంలో తిరిగి సంకీర్ణ రాజకీయాలను ప్రవేశపెట్టింది. జాతీయ రంగస్థలం మీద తెలుగువారి ప్రమేయానికి పట్టం కట్టింది.

భారతీయ జనతాపార్టీకి మెజారిటీ బహుదూరంలోనే నిలిచిపోయింది. ఎన్‌డీఏలోని భాగస్వామ్యపక్షాల సహకారంతో మాత్రమే తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి సాగనంపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని ఘనవిజయం సాధించింది. కేంద్రంలోని కొత్త ప్రభుత్వంలో తెలుగుదేశం, ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించనున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు నిరుత్సాహకరమైన ఫలితాలు వచ్చాయి. గత లోక్‌సభలో నాలుగు స్థానాలు పొందిన తెలంగాణ బీజేపీ తన బలాన్ని రెట్టింపు చేసుకుంది. గత సభలో మూడు స్థానాల బలమే ఉన్నప్పటికీ, ఇటీవల రాష్ట్రంలో అధికారం పొందినందున, మెరుగైన ఫలితాలు సాధించవలసిన కాంగ్రెస్ తన సంఖ్యను ఎనిమిదికి మించి పెంచుకోలేకపోయింది.

వైసీపీ ప్రభుత్వం ఘోరపరాజయం పూర్తిగా స్వయంకృతం. ప్రత్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఏకరువు పెట్టిన జగన్ ప్రభుత్వ దుర్మార్గాలకంటే, ప్రజల అనుభవంలోకి వచ్చినవి కొన్ని రెట్లు ఎక్కువ అని ఈ ఫలితాలు చెబుతున్నాయి. వైసీపీ ని అనేక జిల్లాలనుంచి ఏకమొత్తంగానూ తుడిచిపెట్టారంటే, దుష్పరిపాలన తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. రెండంకెల సంఖ్యకు కూడా చేరుకోలేక కునారిల్లుతూ, ప్రతిపక్ష స్థాయి కూడా దక్కనంత స్వల్పమైన ఉనికి మిగిలిన ఆ పార్టీ తన దుస్థితికి కారణాలను సమీక్షించుకుని సుదీర్ఘ కాలం నిరీక్షించవలసిందే.

కూటమి 21 లోక్‌సభ స్థానాలను సాధించగా, అందులో తెలుగుదేశం సొంతంగా 16 స్థానాలు సంపాదించింది. కేంద్రంలో మెజారిటీ కొరవడిన బీజేపీకి టీడీపీ ఇప్పుడు అత్యంత అవసరమైన, కీలకమయిన భాగస్వామి. బీజేపీ తరువాత అత్యధిక స్థానాలు సాధించిన ఎన్‌డీఏ భాగస్వామి తెలుగుదేశమే. గత రెండు పదవీకాలాల్లో కూడా పేరుకు ఎన్‌డీఏ ప్రభుత్వమే అయినా, తనకు సొంతంగా మెజారిటీ ఉన్నందున నామమాత్రపు సంకీర్ణంగా మాత్రమే వ్యవహరించిన బీజేపీ, ఈసారి అనివార్యంగా భాగస్వామిక రాజకీయాలను అంగీకరించవలసి వస్తుంది. తెలుగుదేశంపార్టీకి, బిహార్‌కు చెందిన జనతాదళ్ యునైటెడ్‌కు వాస్తవ అర్థంలో తగినప్రాధాన్యం విధిగా ఇవ్వవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి విషయంలో అలక్ష్యం చూపుతున్నందుకు, బీజేపీ ఇతర విధానాలపై నిరసనగాను గతంలో ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి వెలుపలికి వచ్చిన తెలుగుదేశం పార్టీకి, ప్రస్తుత విజయాలు మంచి సానుకూలతను సమకూర్చాయి. రాజధాని, పోలవరం వంటి అభివృద్ధి అంశాల మీద కేంద్రం నుంచి తగిన స్పందనను రాబట్టగలిగే శక్తి టీడీపీకి ఇప్పుడున్నది. చంద్రబాబు నాయుడుకు ఉన్న అపారమైన అనుభవం, కార్యదక్షత వల్ల జాతీయ రంగంలో కూడా ఆయన క్రియాశీల బాధ్యతలు నిర్వహించగలరని, బీజేపీ ప్రభుత్వం దూకుడుకు కళ్లెం వేయగలిగేది కూడా చంద్రబాబేనని ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీ ఎనిమిది విజయాలను, బీఆర్ఎస్ సున్నా స్కోర్‌తో కలిపి చూస్తేనే తెలంగాణ ఫలితాలు అర్థమవుతాయి. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పరాజిత బీఆర్ఎస్‌కు వచ్చిన సుమారు 37 శాతం ఓట్లు పార్లమెంటు ఎన్నికలలో ఎవరికి మళ్లుతాయన్న చర్చ జరుగుతూ వచ్చింది. గణనీయభాగం బీజేపీకి పోయినట్టు అర్థమవుతోంది. కేంద్రంలో మహాబలంతో బీజేపీ ప్రభుత్వం ఉండి ఉంటే, ఈ గెలుపులు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించి ఉండేవి. ఇప్పుడు, పరిమిత బలం కలిగిన కేంద్రమే ఉంటుంది కాబట్టి, తక్షణ ప్రమాదం లేదు కానీ, పరిస్థితిని మెరుగుపరుచుకోకపోతే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు కూడా ఇబ్బందులే ఎదురవుతాయి.



తెలుగు రాష్ట్రాల పరిణామాలకు మించిన ప్రాధాన్యం కలిగినవి, దేశ రాజకీయాల గతినే మార్చగలిగేవి పదిహేడో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు. తెలంగాణలో బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించాయి కానీ, జాతీయస్థాయిలో బీజేపీకి తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలో ఆ పార్టీ కొత్తగా అధికారంలోకి రాగలుగుతోంది, మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలోనూ ఘనవిజయాలు సాధించింది. కేరళ వంటి రాష్ట్రంలో ఒక స్థానం గెలవగలిగింది. ఈ విజయాలన్నిటి కంటె, మెజారిటీ ఎదురైన కొరతే బీజేపీకి అతి పెద్ద నష్టం. గత లోక్‌సభలో 303 స్థానాల బలమున్న బీజేపీ, కొత్త లోక్‌సభలో 240 దరిదాపుల్లో సంతృప్తిపడవలసి వచ్చింది. మైనారిటీ ప్రభుత్వాన్ని నడపడం బీజేపీకి కొత్త కాదు. 1999 ఎన్నికలలో బీజేపీ 182 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. అయినా మిత్రపక్షాలతో కలిసి ఒకటో ఎన్‌డీఏ ప్రభుత్వం నడిపింది. కానీ, 2014లో 282, 2019లో 303 స్థానాలను గెలుచుకుని సంకీర్ణ ప్రభుత్వాల పేరుతో తన సొంత ప్రభుత్వాలనే నడిపింది. ఈ సారి, సొంతంగా 370 స్థానాలు గెలవాలని, మిత్రులతో కలసి 400 గెలవాలని ఆశించింది. అవి కేవలం సంఖ్యలు కావు. మూడింట రెండు స్థానాల మెజారిటీ కోసం 370, కాంగ్రెస్ 1984 రికార్డును అధిగమించడం కోసం 400 అంకెలను ఎంచుకున్నారు. అధిక మెజారిటీ కోరుకున్నది రాజ్యాంగ సవరణలకు వెసులుబాటు కోసమే కావచ్చు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి అదే ఆయుధంగా మారింది. రాజ్యాంగాన్ని మార్చబోతున్నారని, రాజ్యాంగం అట్టడుగు వర్గాలకు కల్పించిన ప్రత్యేక రక్షణలను తొలగించబోతున్నారని ప్రతిపక్షం చేసిన ఆరోపణ ఓటర్ల మీద తీవ్రంగా ప్రభావం చూపినట్టు, సామాజికవర్గాల వారీ ఓటింగ్ శాతాలు సూచిస్తున్నాయి.

పదిహేనేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని దాదాపు రెట్టింపు చేసుకోగలగడానికి ఆ పార్టీ మిత్రపక్షాలతో చూపించిన సర్దుబాటు వైఖరి, రాహుల్ జోడో యాత్రలు, విస్పష్టమైన విధానాలతో వైఖరుల రూపకల్పన ముఖ్యమైన కారణాలు. బీజేపీ విస్తరణను అడ్డుకోగలిగిన మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేలను ప్రధానంగా చెప్పుకోవాలి. ప్రతిపక్ష పార్టీలను, మాజీ మిత్రపక్షాలను చీలికల ద్వారా బలహీనపరచాలనే ఆలోచనను ప్రజలు సమ్మతించరని మహారాష్ట్ర నిరూపించింది. ద్రవిడ వాదానికి తాను పెట్టనికోటనని తమిళనాడు మరోసారి నిరూపించుకుంది. దేశంలోని ఈ నాయక బాహుళ్యం ఎక్కడికక్కడ ఆత్మరక్షణ చేసుకోవడంతో పాటు, అవాంఛనీయమైన అధిక మెజారిటీలను నిరోధించగలిగింది. పాపం, నవీన్ పట్నాయక్ బీజేపీని సొంతంగా ఢీకొని, నష్టపోయారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటికి, బీజేపీ ఘనవిజయమే ఖాయమన్న అభిప్రాయం దేశంలో నెలకొని ఉన్నది. అధికారపక్షం తగిన రాజకీయ నినాదాలతో సర్వసన్నద్ధంగా ఉన్నట్టు కనిపించింది. మొదటి రెండు దశల ప్రచారంలో సాధారణ అంశాలే వినిపించగా, మూడోదశనుంచి ప్రధాని మాటలో తీవ్రత, విభజనవాదం పెరిగాయి. ప్రధానిహోదాను కూడా ఖాతరు చేయకుండా, ఊహించని రీతిలో నరేంద్రమోదీ మాట్లాడసాగారు. ఆయన అట్లా మాట్లాడడానికి, ఓటర్లలో కనిపిస్తున్న అనాసక్తి కారణమన్న విశ్లేషణలు మొదలయ్యాయి. తక్కిన అన్నిదశలలోను, చివరి రోజుతో సహా, నరేంద్రమోదీ వివాదాస్పదమైన అంశాలే మాట్లాడుతూ వచ్చారు. మోదీ రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్నారని ఇండియా కూటమి, కాంగ్రెస్ కూటమి బీసీ, ఎస్సీల రిజర్వేషన్లు తగ్గించి ముస్లిములను ఇవ్వాలనుకుంటున్నదని మోదీ పరస్పర ఆరోపణలు సంధించుకున్నారు. మోదీ విభజన వాదానికి పెద్దగా ఆమోదం లభించలేదని ఫలితాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, రామమందిర ప్రతిష్ఠను, రాజకీయాలను ప్రజలు వేరువేరుగానే పరిగణించారని తెలుస్తోంది. అయోధ్య (ఫైజాబాద్) స్థానంలో బీజేపీ ఓడిపోయిందంటే అర్థం ఏమిటి?

ఉమ్మడి పౌరస్మృతి, రాజ్యాంగం నుంచి సెక్యులర్ పదం తొలగింపు, ఒకే దేశం–ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, జీఎస్టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులు వంటి అనేక అంశాలు బీజేపీ ఎజెండాలో ఉన్నాయి. ఈ అంశాలపై ప్రతిపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు భిన్నాభిప్రాయాలు, సొంత ప్రతిపాదనలు ఉన్నాయి. వీటికి సొంతంగా అధిక మెజారిటీ కావాలి, రాష్ట్రాలలో కూడా సొంతప్రభుత్వాలు ఉండాలి. ప్రాంతీయ పార్టీలను సాధ్యమైనంతగా అప్రధానం, బలహీనం చేయాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ ఆశయం. తమ ప్రభుత్వాలు ఉన్నచోట తప్ప, ఇతర ప్రభుత్వాలు ఉన్న చోట, ముఖ్యంగా ప్రాంతీయపార్టీలు ఉన్న ప్రభుత్వాలు ఉన్నచోట నిధుల పంపకంలో గానీ, గవర్నర్‌ల జోక్యంతో కానీ ఇబ్బందులు కల్పించడం గత పదేళ్లుగా చూస్తూ ఉన్నదే. అయితే, అనుకున్నంత బలం సమకూరదేమోనన్న భయం ఏ మూలో ఉండడంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయపార్టీలతో కూటమిలోకి వచ్చింది.

ఎవరిమీదా ఆధారపడనక్కరలేని స్థితిలో, కేంద్రప్రభుత్వ దర్యాప్తు ఏజెన్సీలను ప్రతిపక్షాల మీద ప్రయోగించడానికి, రాజకీయనేతలను జైళ్లలో పెట్టడానికి బీజేపీ ప్రభుత్వానికి వెసులుబాటు లభించింది. రాష్ట్రాల అధికారాలను కుదించే అనేక నిర్ణయాలను కూడా గత పదేళ్లలో యథేచ్ఛగా తీసుకోగలిగారు. సంకీర్ణ ప్రభుత్వాలను నడిపేవారు ఏకాభిప్రాయ సాధనలో నిమగ్నం కావలసి ఉంటుంది. అందుకు వాజపేయి, మన్మోహన్ సింగ్‌కు ఉన్నటువంటి మృదు స్వభావం అవసరం. నరేంద్ర మోదీ తానే మూడోసారి ప్రధాని కాదలచుకున్నట్టు, మంగళవారం సాయంత్రం ఢిల్లీలో పార్టీ కార్యక్రమంలో ఇచ్చిన సందేశం సూచిస్తోంది. ప్రస్తుత విజయాన్ని ఎన్డీఏ విజయంగానే చెబుతున్నారు, రాబోయే ప్రభుత్వాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వంగానే సంబోధించారు. అవినీతిపై చండశాసనంలో తగ్గేదే లేదని, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో ముందుకే వెడతామని ఆయన గట్టిగా చెప్పారు. 2019 నాటి సంబరాలతో పోల్చినప్పుడు, ఇప్పటి పార్టీ కార్యక్రమం నీరసంగానే కనిపించింది.

లోక్‌సభ ఫలితాలు మోదీ పరాజయాన్నే సూచిస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారం అంతా మోదీ వ్యక్తి ప్రతిష్ఠచుట్టూ జరిగినందున, మెజారిటీ పొందలేకపోవడం మోదీ వ్యక్తిగత అపజయంగా పరిగణించడంలో తప్పేమీ లేదు. మోదీ, అమిత్ షా ఇద్దరే మొత్తం పరిపాలనాచక్రాన్ని, రాజకీయచక్రాన్ని ఇంత కాలం తిప్పుతూ వచ్చినందున, సంప్రదింపులు, సమన్వయం అవసరమైన నూతన ప్రభుత్వాన్ని వారు సౌకర్యంగా నిర్వహించగలరా అన్న అనుమానం రావడం సహజం. తాను తప్పుకుంటానని మోదీ పార్టీ ముఖ్యుల ముందు ప్రస్తావించారేమో తెలియదు కానీ, ప్రస్తుతానికి పాత నాయకద్వయమే అగ్రపీఠాలపై కొనసాగుతారనిపిస్తోంది.

ఇండియా కూటమి నుంచి చంద్రబాబు నాయుడుకు, నితిశ్ కుమార్‌కు సూచనలు వెళ్లాయని చెబుతున్నారు కానీ, వారు అందుకు అంగీకరించే అవకాశం లేదు. ఈ తరుణంలో వారు తమ భాగస్వాములను మార్చుకోవడం నైతికం కాదు. కాకపోతే, ప్రజాస్వామిక సంప్రదాయాలను అనుసరించేట్టు, విభేదించేవారితోనూ విపక్షాలతోనూ వేధింపు ధోరణిలో వ్యవహరించకుండా బీజేపీని మిత్రపక్షాలు కట్టడి చేయగలిగితే బాగుండునని ప్రజాస్వామికవాదులు ఆశిస్తున్నారు.

ఈ ఎన్నికలు నిరూపించిన మరొక ముఖ్యమైన అంశం, మతం పేరుతో, జాతీయత పేరుతో ఎంతటి ఉద్వేగాలను వ్యాపింపజేసినా, అవి దైనందిన జీవన సమస్యల నుంచి ప్రజలను ఎంతోకాలం దృష్టి మళ్లించలేవు. ఈ ఎన్నికలఫలితాలు గ్రామీణ భారతంలోని సంక్షోభపరిస్థితులను సూచిస్తున్నాయని, ప్రజలు స్పష్టంగా ఒక సంకేతం పంపించారని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రజాప్రతినిధుల అరాచక హింసోన్మాదాన్ని, అవినీతిని ఓటు ఆయుధంతో తిప్పి కొట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, తమ కొత్త ప్రభుత్వం ద్వారా విభజనానంతర సమస్యల పరిష్కరించుకుంటారని, అన్ని హంగుల రాజధానితో సహా అభివృద్ధి ఆకాంక్షలన్నిటిని సాధించుకుంటారని ఆశిద్దాం. ●

బాబు నాయకత్వానికి, కూటమి దక్షతకు పట్టం

చంద్రబాబు పాలనలో 2014–19 మధ్య అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు లబ్ధిపొందాయి. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం సమపాళ్లలో జరిగింది. ప్రజాస్వామ్యయుతంగా పాలన నడిచింది. 2019–24 మధ్య జగన్ పాలన చంద్రబాబు పాలనకు పూర్తి విరుద్ధంగా నడిచింది. ఆ తేడాను ప్రజలు అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నారు. జగన్‌ను గెలిపించి మోసపోయామని ప్రజలు బాధపడుతున్న సమయంలో అక్రమ కేసులతో చంద్రబాబును 53 రోజులు జైల్లో నిర్బంధించారు. భువనేశ్వరిని శాసనసభలో అవమానపరచడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. లోకేష్ ప్రజాగళాన్ని అడ్డుకోవడం, పవన్‌కళ్యాణ్ వ్యక్తిత్వంపై దాడి చేయడం ప్రజలకు కోపాగ్ని రగిల్చింది. అంతిమ నిర్ణేతలు ప్రజలేగాని నిర్బంధాలు, మద్యం పీపాలు కాదని ఈ ఎన్నికలు రుజువు చేశాయి.

ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇది అతిపెద్ద ప్రజా తీర్పు. జగన్‌కు ప్రతిపక్ష హోదాను కూడా ప్రజలు ఇవ్వలేదు. విధ్వంసం నుండి రాష్ట్రాన్ని చంద్రబాబు పాలన మాత్రమే గట్టెక్కించగలదని ప్రజలు భావించి ఇచ్చిన తీర్పు ఇది. మోసపోయిన పేదలు ఇచ్చిన తీర్పు. భవిత కోసం యువత ఇచ్చిన తీర్పు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇచ్చిన తీర్పు. తమ ఆస్తులు, ప్రాణాలు కాపాడుకోవడానికి సకల జనులు ఇచ్చిన తీర్పు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు ఇచ్చిన తీర్పు. మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నాయకత్వాలకు ప్రజలు పట్టం కట్టిన తీర్పు.

ఈ అధికారం చంద్రబాబుకు పూలబాట కాదు. రూ. 13 లక్షల కోట్లు అప్పుతో ఏడాదికి రూ.50 వేల కోట్ల వడ్డీ, అసలు వాయిదాల చెల్లింపు భారం మోయాల్సి వుంది. వివిధ వర్గాలకు జగన్ పెట్టిన బకాయిలు రూ.2 లక్షల కోట్ల చెల్లింపులు చేయాల్సి వుంది. మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేయాల్సి వుంది. అమరావతి నిర్మాణం చేసి ఉద్యోగాలు, సంపద సృష్టి చేయాల్సి ఉంది. నీలి మీడియా, జగన్ మాఫియా దుష్ప్రచారాలు, దాడులు ఎదుర్కోవాల్సి వుంటుంది. ఈ విజయంతో కూటమి శ్రేణులు నమ్రత పెంచుకుని ప్రజాభిమానాన్ని మరింత పెంచుకోవాలి.



2004లో చంద్రబాబు ఓడిపోకుండా వుంటే నేడు ప్రతి జిల్లా కేంద్రం మరో సైబరాబాద్ అయి వుండేది. 2019లో ఓడిపోకుండా వుంటే నేటికి 175 నియోజకవర్గ కేంద్రాలు ఉపాధి కల్పనా కేంద్రాలుగా అభివృద్ధి అయి వుండేవి. రాష్ట్రానికి జగన్ విధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అధిగమించాలి. అందుకు చంద్రన్న నాయకత్వమే తగినదని ప్రజలు నిర్ణయించారు. అందుకే, క్లాసు, మాసు ఒక్కటై బందిపోట్ల ముఠాను చిత్తుచిత్తుగా ఓడించాయి. జగన్ అండ్ కో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపాడు. విషపూరిత మద్యం పోసి 35 లక్షల మంది పేదల ఆరోగ్యాలను పాడు చేశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదల అసైన్‌మెంట్ భూములు 10 లక్షల ఎకరాలు కొల్లగొట్టారు. లక్ష కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించాడు. పంచాయతీలు, మున్సిపాలిటీల నిధులు దారిమళ్లించి స్థానిక పాలనను నిర్వీర్యం చేశారు. పోలవరాన్ని గండికొట్టి కరువుకోరలకు ప్రజల్ని బలిపెట్టాడు. విశాఖ భూ కబ్జాల కోసం అమరావతిపై నిందలు మోపి ఉద్యోగాలు, సంపద సృష్టించే రాజధాని లేకుండా చేశాడు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం మాఫియాగా మారి రూ.10 లక్షల కోట్లు విలువ గల ప్రకృతి వనరుల్ని, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. ప్రయివేట్ ఆస్తుల్ని, భూముల్ని కబ్జా చేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారు. ప్రశ్నించిన పౌరుల్ని, మీడియాను, మేధావుల్ని, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో తోయించాడు. చిన్నాన్న హంతకుల్ని కూడా కాపాడే దుర్మార్గ స్థితికి దిగజారాడు. తన నేరాలు, ఘోరాల నుండి ప్రజల దృష్టి మళ్ళించడానికి కుల, మత, ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చగొట్టాడు. పదిచ్చి వంద గుంజుకొన్న వైనాన్ని పేదలు అర్థం చేసుకున్నారు. తన స్వార్థ రాజకీయం కోసం 30 మందికి పైగా పింఛన్‌దారుల ప్రాణాలు పోగొట్టి శవ రాజకీయం చేశాడు. గులకరాయి దాడి కథ నడిపి ఓ బీసీ బిడ్డను 45 రోజులు జైలుపాలు చేశాడు. కోడికత్తి డ్రామాతో దళిత యువకుణ్ణి ఐదేళ్ళు జైలుపాలు చేశాడు. పేదల్ని ఇలా కాల్చుకు తిని పేదల మనిషిగా కపట ప్రేమ ఒలకబోశాడు. పేదల ద్రోహి జగన్ అని, పేదల పెన్నిధి చంద్రన్న అని గుర్తించి వైకాపాకు పేదలు తగిన శాస్తి చేశారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు కూటమికి అఖండ విజయం చేకూర్చాయి. రాష్ట్ర చరిత్రలో ప్రతిపక్ష నాయకత్వ హోదా కోల్పోయింది జగన్ ఒక్కడే.

– గురజాల మాల్యాద్రి
టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి

మోదీ మ్యాజిక్ ఏమయింది?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'రాసిన అక్షరం కన్నా ఉపన్యాసాలే జనాన్ని ప్రభావితం చేస్తాయని నాకు తెలుసు. మహామహా రచయితలు సాధించలేని మార్పు ఈ భూమిపై గొప్ప వక్తలే సాధించారు' అని జర్మనీ నియంత హిట్లర్ తన ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' (ఆంగ్లంలో 'మై స్ట్రగుల్') ముందుమాటలో రాశారు. కాని నేతలు ఎంత గొప్ప వక్తలైనా వారి మాటల్లో నిజాయితీ లేకపోతే, రోజుకో రకంగా మాట్లాడితే, మాట్లాడిన మాటల్లో అబద్ధాలున్నాయని తేలితే ప్రజలు ఆ మాటల్ని విశ్వసించరని ఎవరికి ఎప్పుడు ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసని మంగళవారం నాడు వెల్లడైన 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఫలితాలను సువర్ణ ఘట్టంగా భావించవచ్చు.

ఒక దశాబ్ద కాలం (2014–24)లో దేశంలో అన్ని వ్యవస్థలపై పట్టు సాధించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తానేమి చేసినా ప్రజలు హర్షిస్తారని, కేవలం తన ప్రచారంతోనే వారు మైమరిచిపోయి బీజేపీకి పట్టం కడతారని ఆశించినట్లు అర్థమవుతోంది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ఆయన దాదాపు 200 ఎన్నికల సభల్లో ప్రసంగించారు. వివిధ భాషల్లో కనీసం 50 టీవీ ఛానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఎన్నికలు లేనప్పుడు కూడా ఆయన నెలకు కనీసం 20 ప్రసంగాలు చేశారు. టీవీ ఛానెల్స్, సోషల్ మీడియా యుగం కనుక తన హావభావాలతోనూ, ధ్యానముద్రలతోనూ కూడా జనాన్ని ఆయన ప్రభావితం చేయాలనుకున్నారు. తన పేరును తానే వందలసార్లు ఉచ్చరించారు. బీజేపీకి స్టార్ క్యాంపెయినర్లు ఎంతో మంది ఉన్నప్పటికీ మోదీయే అసలైన స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠ వరకు తానొక్కడే అన్నట్లుగా వ్యవహరించారు. పదే పదే ఒకే మాట చెబితే జనం నమ్ముతారేమోనని భావించి చార్ సౌ పార్ (400కు పైగా) సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాంగ్రెస్ ఈ సారి 50 సీట్లు కూడా దాటదని చెప్పారు. తానేది చెబితే జనం అది నమ్ముతారని పరిపూర్ణంగా విశ్వసించిన మోదీ ప్రతిపక్షాలు ప్రజల వనరులను ముస్లింలకు పంచిపెడతారని చెప్పేందుకు కూడా వెనుకాడలేదు. మహాత్ముడిపై రిచర్డ్ అటెన్ బరో సినిమా తీయక ముందు గాంధీ ఎవరో లోకానికి తెలియదని చెప్పేందుకు కూడా ఆయన తెగించారు!

రోజురోజుకూ ఒక వ్యక్తి కేంద్రీకృత వ్యవస్థగా మారిన భారతీయ జనతా పార్టీకి మోదీ తిరుగులేని నాయకుడే కావచ్చు. ఆయన నాయకత్వానికి ఆయనే ముగ్ధుడై తనది కారణ జన్మ అని, దేవుడే తనను పంపించాడని చెప్పుకున్నారు. పూరీ జగన్నాథుడే మోదీ భక్తుడని బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు వాక్రుచ్చారు. మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ నిర్మాణపరంగా ఎంతో ఎదిగిపోయిందని, దానికి ఆర్ఎస్ఎస్ వంటి సంస్థ అవసరం ఇక ఏ మాత్రం లేదని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాయే ప్రకటించారు. గంటకు పైగా ఇంటర్వ్యూలు చేయడం తప్ప ప్రజల మనసుల్లో ఉన్న ప్రశ్నలను లేవనెత్తాలని జర్నలిస్టుల రూపంలో వచ్చిన టీవీ ప్రతినిధులు కూడా అనుకోలేదు. ఏమైతేనేం దాదాపు 80 రోజులుగా జరిగిన ఎన్నికల ఘట్టంలో ఎన్నో నాటకీయ దృశ్యాలు, భావోద్వేగ ప్రసంగాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చూసే అవకాశం కలిగింది. అంతిమంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన దాదాపు డజన్ సంస్థలు ఎన్డీఏకు 350కి పైగా స్థానాలు లభిస్తాయని, మోదీ అన్నట్లుగా 400 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదని ప్రకటించడంతో ఈ దేశంలో మీడియా సంస్థల ధైర్యం ఎంత దిగజారిపోయిందో, ఎందుకు వారు భయోత్పాతానికి గురయ్యారో అర్థం అవుతుంది. కేవలం షేర్ మార్కెట్ పతనం కాకుండా ఉండేందుకే వారు అలా చేశారా అన్న అనుమానాలూ లేకపోలేదు.

నిజానికి మోదీని ఢీకొనడం అంత సులభం కాదని, ఆయన ఏ విధంగానైనా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అనుకున్నవారే ఎక్కువగా ఉన్నారు. చండీగఢ్‌లో మేయర్ ఎన్నికల్లో బ్యాలట్ పేపర్లలో మార్పులు చేయడం, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పేరును ప్రతిపాదించినవారు రిటర్నింగ్ అధికారి వద్దకు రాలేకపోవడం, ఇండోర్‌లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడం, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇద్దరు ముఖ్యమంత్రులు అరెస్టు కావడం వంటి ఘట్టాల తర్వాత ఇక మోదీ ఘన విజయాన్ని ఎవరు ఆపగలరులే అని చాలా మంది భావించారు. ఈడీ, సిబిఐ వంటి సంస్థలు సృష్టించిన భయోత్పాతం అంతా ఇంతా కాదు. పార్లమెంట్‌లో చర్చలు లేకుండా, ప్రతిపక్షాలు లేకుండా బిల్లులు ఆమోదించడంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందనిపించింది. ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పుతో బీజేపీ అక్రమ నిధుల వసూళ్ల గురించి జనానికి తెలిసినా పెద్దగా పట్టించుకోరేమో అనిపించింది. కాని ఆశ్చర్యకరంగా ఎన్నికల ఫలితాలను చూస్తే మోదీ మాయాజాలం చాలా మటుకు మాయమైపోయినట్లు అర్థమవుతోంది.

నిజానికి ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు అవసరమైనంత



నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీల నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల బీజేపీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదేమో? కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని 2024లో తేలిపోయింది.

సంఘటితంగా పనిచేయలేదు. ఇండియా కూటమి ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే ఆ పార్టీలో సీనియర్ నాయకుడు నితీశ్ కుమార్ ప్లేటు ఫిరాయించి మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి సభ్యులకు తగినన్ని సీట్లు ఇచ్చేది లేదని చెప్పేశారు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపచేయడంతో ఆ సంస్థ ఆర్థికంగా బలహీనపడింది. మధ్యప్రదేశ్, హర్యానాలాంటి చోట్ల బలమైన కాంగ్రెస్ నేతల్ని బీజేపీ తన వైపునకు తిప్పుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష పార్టీలను నిలువునా చీల్చారు. ఎన్నో బలహీనతలు, సమస్యలు, వనరుల లోపాల మధ్య కొట్టుమిట్టాడుతూ ప్రతిపక్షాలు ప్రచారాన్ని నిర్వహించాయి. మోదీ, ఆయన దళం చేసిన భారీ ప్రచారం ముందు ప్రతిపక్షాల ప్రచారం వెలవెలబోయినట్లు కనిపించింది. అయినప్పటికీ ఇవాళ బీజేపీ గత రెండు ఎన్నికల్లో మాదిరి మెజారిటీ సీట్లు సాధించలేకపోవడం, ఇండియా కూటమికీ, ఎన్డీఏకు మధ్య సీట్ల వ్యత్యాసం బాగా తగ్గిపోవడం మోదీ ఏకచత్రాధిపత్యాన్ని జనం కోరుకోవడం లేదని అనుకోవడానికి ఆస్కారం కలిగిస్తుంది.

ఉత్తరప్రదేశ్ లాంటి బీజేపీ కంచుకోటలో సగానికి సగం సీట్లు కోల్పోవడం, అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం దేనికి సంకేతం? గతంలో కూడా బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పరాజయం పాలైంది. అయోధ్యలో నాడు కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు రామమందిర నిర్మాణం తర్వాత కూడా యూపీలో బీజేపీ ప్రాభవం తగ్గిపోవడం ఏ సంకేతాలు పంపిస్తున్నాయి? రామమందిర నిర్మాణం కల్పించిన భావోద్వేగాలు పొంగే కాని, వాపు కాదని, ఈ దేశంలో మతాన్ని రాజకీయాలతో సమ్మిళితం చేయడాన్ని రాజ్యాన్ని ప్రజలు విశ్వసించడం లేదని అనుకోవాలా? లేక ప్రధానమంత్రి నరేంద్రమోదీ మతాన్ని తన స్వంత రాజకీయాలకు ఉపయోగించుకోవడాన్ని జనం హర్షించడం లేదని భావించాలా? నిజానికి మోదీ వన్ మాన్ షోను కొందరు ఆర్ఎస్ఎస్ నేతలే హర్షించలేదు. ఈ ఎన్నికల్లో మోదీకి సంపూర్ణ మెజారిటీ రాకపోతేనే మంచిదని, వస్తే తమను కూడా లెక్కచేయరని అనుకున్న ఆర్ఎస్ఎస్ పెద్దలు కూడా ఉన్నారు. ఎందుకో నాగపూర్ కూడా ఈ సారి అన్యమనస్కంగానే వ్యవహరించింది. ఆర్ఎస్ఎస్ పూర్తిగా బీజేపీని వదిలేస్తే ఈ 240 సీట్లు కూడా వచ్చేవి కావని అనుకునేవారు ఉన్నారు.

నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీ నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ఉదాహరణకు తెలంగాణలో బీజేపీ నుంచి గెలిచిన వారిలో సగానికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. కేరళలో సినీనటుడు సురేష్ గోపీ బీజేపీ బలంతో కన్నా తన వ్యక్తిగత ఆకర్షణ ఆధారంతో గెలిచారనవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం మద్దతు లేకపోతే బీజేపీకి అసెంబ్లీలో కాని, పార్లమెంట్‌లో కాని ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు. అందువల్ల మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల భారతీయ జనతా పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో కూడా బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదని చెప్పేవారు కూడా లేకపోలేదు. 2024లో కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని తేలిపోయింది.

ఏమైతేనేం పది సంవత్సరాల తర్వాత దేశంలో మళ్లీ సంకీర్ణ రాజకీయాలు ప్రారంభమయ్యాయి. రెండుసార్లు అఖండమైన మెజారిటీతో బీజేపీని గెలిపించినప్పటికీ మోదీ మళ్లీ దేశం సంకీర్ణ యుగంలోకి వెళ్లకుండా చేయలేకపోయారు. ఇది కూడా మంచి పరిణామమే. రాష్ట్రాల ఆకాంక్షలను విస్మరించకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. నిజానికి ఈ పదేళ్లు ప్రజాస్వామికంగా, ఏకాభిప్రాయ సాధనతో పరిపాలన సాగించి ఉంటే, ప్రతిపక్షాలనూ విశ్వాసంలోకి తీసుకుని ఉంటే, అన్ని వ్యవస్థల్నీ నియంత్రణలోకి తీసుకోకుండా వాటిని పారదర్శకంగా స్వేచ్ఛగా పని చేయించి ఉంటే, ఏడాదికి కనీసం ఒక్క విలేఖరుల సమావేశమైనా నిర్వహించి అరమరికలు లేకుండా మాట్లాడి ఉంటే, ప్రతిపక్షాలను అణచివేయాలన్న ఆలోచనను వదిలిపెట్టి ఉంటే మోదీ మళ్లీ భారీ మెజారిటీతో తిరిగి వచ్చేవారేమో. ఒక బలమైన వ్యవస్థ, బలమైన భావజాలం ఉన్నప్పటికీ అవి ఒక వ్యక్తి చుట్టూ తిరిగితే విజయవంతం కాలేవని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

స్వచ్ఛమైన పర్యావరణమే గొప్ప వారసత్వ ఆస్తి!

భూమిపై ఉన్న అన్ని జీవులకు పర్యావరణం ప్రాథమిక జీవన సహాయక వ్యవస్థ. ఇది సహజ, మానవ నిర్మిత భాగాల కలయిక. సహజ భాగాలలో గాలి, నీరు, భూమి, జీవులు ఉన్నాయి. రోడ్లు, పరిశ్రమలు, భవనాలు మొదలైనవి మానవ నిర్మిత భాగాలు. సహజ వాతావరణాన్ని నాలుగు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు – బయోస్పియర్, లిథోస్పియర్, హైడ్రోస్పియర్, అట్మాస్పియర్. భూమిపై పొరను లిథోస్పియర్ అని పిలుస్తారు. ఇది రాళ్ళు, ఖనిజాలతో చేసిన నేల పలుచని పొర. హైడ్రోస్పియర్ సముద్రాలు, మహాసముద్రాలు, నదులు, సరస్సులు, చెరువులు మొదలైన నీటి వనరులను కలిగి ఉంటుంది. నీటి ఆవిరి, వాయువులు, ధూళి కణాలతో కూడిన వాతావరణం భూమిని చుట్టుముట్టే గాలి పొర. మానవులు, మొక్కలు, జంతువులతో కూడిన జీవ ప్రపంచం జీవగోళాన్ని ఏర్పరుస్తుంది. పర్యావరణాన్ని తయారు చేయడంలోను, విచ్ఛిన్నం చేయడంలోనూ మానవులు భారీ పాత్ర పోషిస్తున్నారు. భూమిపై అత్యున్నత మేధోశక్తిగా, మానవులు పర్యావరణ క్షేమాన్ని చాలావరకు ప్రభావితం చేస్తారు. అన్ని జీవులపై పర్యావరణ ప్రభావం మానవులు పర్యావరణంతో వ్యవహరించే విధానానికి నేరుగా అనులోమానుపాతంలో వుంటుంది. గాలి, నీరు లేదా భూమి లేకుండా ఎలాంటి ఉనికి సాధ్యం కాదు.

భూమిపై సంచరించే అన్ని రకాల ప్రాణుల ఉనికికి పర్యావరణమే ప్రాథమిక మూలం. అయితే, నేడు పర్యావరణం విపరీతంగా దోపిడీ చేయబడుతోంది, దీని కారణంగా పర్యావరణ పరిస్థితులు రోజురోజుకు అధ్వాన్నంగా మారుతున్నాయి. గాలి, నీరు మరియు భూమి కాలుష్యం, మైనింగ్, పారిశ్రామికీకరణ, ఆధునిక పట్టణీకరణ, అటవీ నిర్మూలన, రసాయన వ్యర్థాల విడుదల వంటివి పర్యావరణం క్రమంగా క్షీణించడానికి కారణమయ్యే కొన్ని ప్రధాన కారకాలు.

పర్యావరణపు వేగవంతమైన క్షీణతను తగ్గించడానికి ప్రపంచ నాయకులు కృషి చేస్తున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు పర్యావరణ సమస్యలను అరికట్టడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి, చర్యలు తీసుకోవడానికి చొరవతో ముందుకు వచ్చాయి. ఈ కార్యక్రమాల్లో కొన్ని 2019 సస్టెయినబుల్ డెవలప్మెంట్ సమ్మిట్, 2019 క్లయిమేట్ యాక్షన్ సమ్మిట్, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ కోసం 2030 ఎజెండా, పారిస్ ఒప్పందం, ఇంకా నదుల సంరక్షణ, అటవీ పెంపకం, తీర నిర్వహణ, చిత్తడి నేల పరిరక్షణ మొదలైన అనేక ఇతర కార్యక్రమాలు చేపట్టాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మొక్కుబడి కార్యక్రమాలు చేస్తున్నాయి. ప్రచార ఆర్భాటంగా పర్యావరణ దినోత్సవం రోజున కొన్ని మొక్కలు నాటుతున్నాయి. నాయకుల పర్యటనల సందర్భంగా అవి అడ్డుగా ఉంటున్నాయని అధికారులు కొన్ని చెట్లను నరికేస్తున్నారు. ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పాలి. చిత్తశుద్ధితో మొక్కలు నాటి, వాటి పోషణ భారాన్ని కూడా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్వీకరించాలి. కవులు, రచయితల నుండి పర్యావరణ సాహిత్యాన్ని ఆహ్వానించి, ప్రోత్సహించి పుస్తకాలుగా అచ్చేసి రేపటితరానికి అందించాలి. పర్యావరణం కేంద్రంగా పాఠ్యపుస్తకాలను రూపొందించాలి.


వన్యప్రాణులు, వివిధ జాతుల మనుగడ కోసం పర్యావరణాన్ని పరిరక్షించడం అవసరం. వాతావరణ మార్పుల వినాశకరమైన వేగంతో, కాలుష్యం – పర్యావరణం దోపిడీ ఫలితంగా, పర్యావరణానికి మరింత నష్టం జరగకుండా రక్షించే మార్గాలను కనుగొనడం మొదటి ప్రాధాన్యతగా వుండాలి. పర్యావరణాన్ని మానవ దోపిడీకి ముందున్న పూర్వ స్థితికి తీసుకురావడం చాలా ముఖ్యమైన, ఏకైక పరిష్కారం.

కొందరు తమ స్వార్థం కోసం కొండల్ని పిండి చేస్తున్నారు, చెట్లన్నీ నేల కూలుస్తున్నారు, నీటి నిల్వల్ని పీల్చేస్తున్నారు, జంతువుల్ని వేటాడి చంపుకు తింటున్నారు, పక్షుల్ని కాల్చుకు తింటున్నారు. మొత్తం పర్యావరణాన్ని దోచేసి ఆర్థిక నిల్వల్ని పెంచుకుంటున్నారు. రేపటి తరానికి అసలు పర్యావరణ పచ్చదనపు ఆనవాలు లేకుండా చేస్తున్నారు. మంచి గాలి, నీరు, భూమి, ఆహ్లాదం లేకుండా రేపటితరం ఎలా జీవించగలుగుతుంది? ఆస్తులుంటే సరిపోతుందా? పీల్చేందుకు ఆక్సిజన్ అవసరం లేదా? పర్యావరణ పరిరక్షణంతా ప్రభుత్వ బాధ్యతగానే భావించకుండా ప్రజలు కూడా తమవంతుగా కృషి చేయాల్సిన అవసరం వుంది. పచ్చని పర్యావరణాన్ని కొల్లగొట్టడం మాని, మనిషికొక మొక్కయినా నాటాలి. ఆ కోట్లాది మొక్కలు నేలపై తల ఎత్తుకు నిలబడి, మన ఆరోగ్యాన్ని అనారోగ్యం వైపునకు వాలిపోకుండా నిలబెడతాయి.

– కలిమిశ్రీ, నవ్యాంధ్ర రచయితల సంఘం

(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com




తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.72	1,580.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	659	1053
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	25	247
సామర్థ్యం (టీఎంసీలు)	3.46	4.94

బళ్లారిలో హస్తం హవా!

- కాంగ్రెస్ అభ్యర్థి తుకారాంను వరించిన విజయం
- బీజేపీ అభ్యర్థి శ్రీరాములుపై కాంగ్రెస్ అభ్యర్థి పైచేయి
- ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్‌దే ఆధిక్యం

- మొత్తం ఓట్లు 18,84,040 ● పోలైనవి 13,86,553
- కాంగ్రెస్ అభ్యర్థి తుకారాంకు వచ్చిన ఓట్లు 7,30,845
- బీజేపీ అభ్యర్థి శ్రీరాములుకు వచ్చినవి 6,31,857
- ఆధిక్యత 98,988



తుకారాం

బళ్లారి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బళ్లారి హస్తగతమైంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఈ. తుకారాం చేతిలో బీజేపీ అభ్యర్థి. బి. శ్రీరాములు ఓటమి పాలయ్యారు. ఓట్లలెక్కింపులో తొలిరౌండ్ నుండి కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం ఆధిక్యత కనపరిచారు. బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములుకు ఒక్క రౌండ్‌లోనూ ఆధిక్యత రాలేదు. తుకారాంకు 7,30,845 ఓట్లు పోల్ కాగా బీజేపీ అభ్యర్థి శ్రీరాములుకు 6,31,857 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం 98,988 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

బళ్లారి లోక్‌సభ పరిధిలో మొత్తం 18,84,040 ఓట్లు ఉండగా, ఇందులో 13,86,553 ఓట్లు పోలయ్యాయి. సుమారుగా 73.59 శాతం ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల్లో ఇక్కడ నుంచి మొత్తం 10 మంది పోటీ చేశారు. వీరిలో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాంకు బీజేపీ అభ్యర్థి బి. శ్రీరాములుకు మధ్యనే పోటీ సాగింది. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి వి.క్రిష్ణప్ప కు5911 ఓట్లు, కర్ణాటక రక్షణ సమితి అభ్యర్థి సి. చన్నవీరకు3797 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి కండెక్టర్ పంపాపతికి 2460 ఓట్లు, ఇండిపెండెంట్ వీరేష్‌కు 1870 ఓట్లు, ఎస్‌యూసీఐ అభ్యర్థి ఏ. దేవదాస్‌కు 1741 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 7889 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి ప్రకటించారు.



తుకారాంకు అభినందనలు తెలుపుతున్న మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి



కౌంటింగ్ హాల్ నుంచి బయటకు వస్తున్న నాయకులు

కాంగ్రెస్‌పై ప్రజల నమ్మకానికి ఇది సంకేతం :తుకారాం

ఈ సందర్భంగా ఎంపీగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం మీడియాతో మాట్లాడుతూ, ఈఎన్నికల్లో తన గెలుపునకు ప్రజలు పార్టీ పైన పెట్టిన నమ్మకం కారణమని, ప్రజల నమ్మకాన్ని నిలుపుకుంటామని అన్నారు.

చిత్రదుర్గ ఎంపీగా గోవింద కారజోళ గెలుపు



జిల్లాధికారి వెంకటేష్ నుండి ప్రమాణ పత్రం అందుకుంటున్న గోవిందకారజోళ...

బళ్లారి గాంధీనగర్, జూన్ 4: చిత్రదుర్గ జిల్లా లోక్‌సభ నియోజవర్గం బీజేపీ అభ్యర్థి గోవింద ఎం.కారజోళ విజయబేరి సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి బి.ఎన్.చంద్రప్పపై 48,121 ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. గోవింద కారజోళ 6,84,890 ఓట్లు పొందగా, బి.ఎన్.చంద్రప్ప 6,36,769 ఓట్లు పొందారు. ఇద్దరు మహిళలతో పాటు ఎన్నికల బరిలో మొత్తం 20మంది అభ్యర్థులు ఉండగా 18మంది డిపాజిట్లు కోల్పోయారు. నియోజకవర్గం వ్యాప్తిగా 18,56,876 ఓటర్లు ఉండగా, 13,61,031 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేంద్ర మంత్రిగా మాజీ ఎంపి ఎ.నారాయణస్వామికి బదులుగా కారజోళను ఎన్నికల బరిలో నిలిపిన వ్యూహం ఫలించిందని చెప్పవచ్చు.

తుమకూర జిల్లా శిరా, పావగడ, చిత్రదుర్గ జిల్లాలో చిత్రదుర్గ, మొళకాల్మూరు, చెళ్ళకెర, హిరియూరు, హొసదుర్గ, హోళల్కెర స్థానాలు ఈ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలకుగాను ఏడింటిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందుతారని భావించగా, బీజేపీ-జేడియస్ కూటమి అభ్యర్థిగా కారజోళ గెలుపొందారు. నియోజకర్గంలో ఇప్పటివరకూ జరిగిన 18 సార్లు ఎన్నికలు జరగగా, కాంగ్రెస్11సార్లు, బీజేపీ 3సార్లు విజయం విజయం సాధించగా, పిఎస్‌పి స్వతంత్ర పార్టీ, జనతాదళ్, జేడియు ఒక్కొక్కసారి గెలుపొందాయి. 2009 నుండి జరిగిన ప్రతి లోక్‌సభ ఎన్నికలోనూ కొత్తవారికి నియోజకవర్గ ప్రజలు అవకాశం ఇస్తుండడం గమనార్హం.

ఏపీలో కూటమి గెలుపు.. నాయకుల సంబరాలు



కమ్మసంఘం భవనం హాలులో కేక్ కట్‌చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



తుంగభద్ర కాలనీలో .....



జనసేన నాయకుల విజయోత్సవం

సిరుగుప్ప, జూన్ 4 : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అభ్యర్థులు గెలుపొందడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు, కార్యకర్తలు, మంగళవారం విజయోత్సవాలను జరుపుకున్నారు. సిరుగుప్ప తాలుకాలో వుండే ప్రతి ఒక్క ఆంధ్రుడు భారీఎత్తున బాణసంచా పేల్చి కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు బైకు ర్యాలీ నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కమ్మసంఘం భవనంలో కేక్‌కట్ చేశారు. తుంగభద్ర కాలనీవాసులు, మహిళలు, జనసేన నాయకులు తాయమ్మదేవికి పూజలు జరిపి ర్యాలీ నిర్వహించి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఏపీలో అత్యధిక మెజార్టీ రావడంపై ధీమా వ్యక్తం చేశారు. కమ్మసంఘం గౌరవాధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు విజయోత్సవ సంబరాలపై అభినందనలు తెలిపారు. పవన్‌కళ్యాణ్‌పార్టీ స్థానిక అధ్యక్షులు మూర్తి కార్యకర్తలు భారీగా పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలుపుతూ సందేశం పంపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యనారాయణ, ఎం ప్రసాదరావు, చౌదరి, ప్రభుకిరణ్, తాతినేని ప్రసాద్, ప్రతాప్ చౌదరి, మురళి, తుంగభద్ర కాలనీవాసులు కోనేరు గోపాల కృష్ణ, ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.



కేఎస్ భవన్ నుంచి ర్యాలీ

టీడీపీ గెలుపుపై కంప్లిలో హర్షం

కంప్లి, జూన్ 4 : కంప్లి పట్టణంలో తెలుగుదేశం పార్టీ అభిమానులు బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బట్టా ప్రసాద్, గోపాలకృష్ణలు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలో వైసీపీ అవినీతి ప్రభుత్వం వల్ల ప్రజలు విసుగుచెంది టీడీపీ పార్టీకి ప్రజలు కనివినీ ఎరుగని రీతిలో మెజార్టీ ఇచ్చారన్నారు. చంద్రబాబునాయుడు పాలనలో పూర్తిగా సంక్షేమాలు, అభివృద్ధి కొనసాగి ఆదర్శ రాష్ట్రంగా పేరుపొందుతుందని తెలిపారు. అంతకు ముందు కేఎస్ భవన్ నుండి టీడీపీ అభిమానులు, జనసేన పార్టీ అభిమానులు బైకుర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ కూడలిలో సుష్మిత అనే చిన్నారి తెలుగు దేశం జెండా ఎగురవేస్తూ అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సుధీర్, బ్రహ్మయ్య, బాలకృష్ణ, కిషోర్, ప్రసాద్, మల్లి, జేపీ రాఘవేంద్ర, గోవర్ధన, శీనప్ప, యుగంధర్ నాయుడు, అశ్మిత్‌వర్మ, రాజు, చల్లా రమేష్, నాగరాజు, రాజేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కూడలిలో టీడీపీ జెండా ఎగురవేస్తున్న చిన్నారి



ఎమ్మిగనూరులో కాంగ్రెస్ ఆనందోత్సాహాలు



సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కంప్లి, జూన్ 4 : బళ్లారి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలవడంతో ఎమ్మిగనూరు గ్రామంలో బాణసంచా కాల్చి సంబరాలు, కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా వద్రు వీరేష్ మాట్లాడుతూ తుకారామ్ చేసిన సేవలు, మంచితనమే అయనకు భారీ మెజార్టీ ని ఇచ్చిందన్నారు. అనంతరం ఎమ్మిగనూరు గ్రామంలోని ప్రముఖులకు కాంగ్రెస్ పార్టీ సదాశివప్ప, సూజప్ప, హనుమంతరెడ్డి, రాజు, జయరామిరెడ్డి తదితరులకు సన్మానం చేపట్టారు. ఎమ్మిగనూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక ఓట్లు పోలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో రెహమాన్, నాగిరెడ్డి, హనుమేష, తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంభవృష్టితో ఇళ్లలోకి వర్షపు నీరు

బళ్లారి సిటీ, జూన్ 4: జిల్లాలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురువగా వాగులు, కుంటలు, వాగులు పొంగిపొర్లాయి. బళ్లారి జిల్లాలోని తోరణగల్లు, రాజాపూర్, ఉబ్బలగండి, కెరెరాంపురం తదితర గ్రామాల్లో 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని కర్ణాటక రాష్ట్ర ప్రకృతి విపత్తు నిర్వహణ కేంద్రం అధికారులు తెలిపారు. బళ్లారి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో, పలు పాఠశాలలు, కళాశాలలు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. బళ్లారిలోని మురికివాడల్లో డ్రైనేజీలు నిండి మురికినీరు ఇళ్లలోకి చేరడంతో నిర్వాసితులు రాత్రంతా నిద్రాహారాలు మాని ఇళ్లలోని మురుగునీటిని బయటకు తోడిపారబోశారు.

కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవం



కార్పొరేటర్ విక్కీ నేతృత్వంలో విజయోత్సవాలు




దుర్గమ్మ ఆలయంలో తుకారామ్‌కు అభినందనలు తెలుపుతున్న మహిళలు

బళ్లారిరూరల్, జూన్ 4 : బళ్లారి ఆర్‌వైఎంసీ కళాశాల ఆవరణంలో మంగళవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడంతో బళ్లారి నగర ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున విజయోత్సవం జరుపుకున్నారు.

సండూర్లో బాణసంచా పేలుళ్లు

తోరణగల్లు, జూన్ 4 : కాంగ్రెస్ తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తుకారామ్ గెలుపొందిన సందర్భంగా సండూర్లో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రముఖులు బాణసంచా పేల్చి తమను ఆనందాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రముఖులు, కార్యకర్తలు అయిన పకీరప్ప, చంద్రనాయక్, మంజునాథ్, సత్యనారాయణ మొదలగు ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సండూరులో సంబరాలు చేసుకుంటున్న నాయకులు



సంగనకల్లు గ్రామస్థుల సంబరాలు

హోసూరు జోన్

కృష్ణగిరి విజేత గోపినాథ్

హోసూరు, జూన్ 4:లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో కృష్ణగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి గోపినాథ్ ఘనవిజయం సాధించారు. ఉదయం నుంచి ప్రతి రౌండులోను ఆయన ముందంజలోనే ఉన్నారు. సమీప అభ్యర్థి అన్నాడీఎంకే జయప్రకాశ్‌పై 1,91,831 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రధాన పార్టీ అయిన అన్నాడీఎంకే, బీజేపీ పార్టీల మధ్య పోటీ నెలకొంది. అన్నాడీఎంకే కూటమి కాంగ్రెస్ అభ్యర్థికి గట్టి పోటీ ఇచ్చింది. అయిన రెండో స్థానంతో సరిపెట్టుకోవల్సి వచ్చింది. హోసూరుకు చెందిన గోపినాథ్, జయప్రకాశ్ ఇద్దరు తెలుగువారే కావడం గమనార్హం. గోపినాథ్ విజయం సాధించి బయటికి వచ్చిన వెంటనే ఆయన అనుచరులు, కార్యకర్తలు, కేరింతలు పెడుతూ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించారు.



కృష్ణగిరి నియోజకవర్గం నుంచి గెలిచిన గోపీనాథ్‌కు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న దృశ్యం

కృష్ణగిరిలో కాంగ్రెస్ ప్రభంజనం

హోసూరు జూన్ 4: లోకసభ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. కృష్ణగిరి పార్లమెంట్ పరిధిలోని కృష్ణగిరి, వేపనపల్లి, హోసూరు, తళి, ఊత్తగిరి, బర్గూరు అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 19న తమిళనాడుల్లో ఎన్నికలు జరిగాయి. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. 76 శాతం పోలింగ్ జరిగింది. ఈ పార్లమెంట్ నియోజక వర్గంల్లో కాంగ్రెస్ తరపున గోపినాథ్, అన్నాడీఎంకే జయప్రకాశ్, బీజేపి నరసింహన్, ప్రధాన పార్టీ అభ్యర్థులు పోటీపడ్డారు. మంగళవారం జరిగిన ఓటు ఎన్నికల లెక్కింపుల్లో 28 రౌండ్లులో లెక్కింపులో మొదటి రౌండు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గోపినాథ్ ముందంజులో ఉన్నారు. సాయంత్రం 5 గంటల సమయానికి 16 రౌండ్లు పూర్తి అయ్యాయి. అప్పటికి గోపినాథ్ 80 వేల ఓట్ల లీడింగ్‌తో ఉన్నారు.

కెలవరపల్లి అనకట్టకు పెరిగిన నీటిప్రవాహం

హోసూరు జూన్ 4 హోసూరు కెలవరపల్లి డ్యాంకు నీటి ఇన్ ఫ్లో కర్ణాటకలోని దక్షిణా పినాకిని నది ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలపైనే ఆధారపడి ఉంది. అనకట్టపై 8 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. గత ఏడాది కాలంగా షట్టర్లు మార్పే పనుల వల్ల వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. ఈ క్రమంలో గత నెలలో పనులు పూర్తి చేసి డ్యాంల్లో నీటిని నిల్వ చేస్తున్నారు. దక్షిణ పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో డ్యాంలోకి నీరు చేరింది. గత కొన్ని రోజులుగా కర్ణాటక రాష్ట్రంలోని పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో 309 క్యూబిక్ అడుగులకు చేరిన నీటి ప్రవాహం మంగళవారం ఉదయం నాటికి సెకనుకు 649 క్యూబిక్ అడుగులకు పెరిగింది. దీంతో డ్యాం సామర్థ్యం 44.28 అడుగులు కాగా 35.75 అడుగుల నీరు నిల్వ ఉంది, 100 క్యూబిక్ అడుగుల అదనపు నీటిని నదిలోకి వదులుతున్నారు.

పదిహేనేళ్ల తరువాత కాంగ్రెస్‌కు దక్కిన కొప్పళ

బళ్లారి గాంధీనగర్, జూన్ 4: ఈ సారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల నడుమే తీవ్ర పోటీ నెలకొనగా... కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. పదిహేను ఏళ్ల తరువాత కొప్పళ స్థానాన్ని తిరిగి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం గమనార్హం. బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజ్‌ను ఓడించడం ద్వారా కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాళ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. దీంతో నియోజకవర్గంలో బీజేపీ ఈ సారి ఓటమి చూడాల్సి వచ్చింది. ఈ సారి బీజేపీ కొప్పళ నియోజకవర్గానికి అభ్యర్థి ని కేటాయించే విషయంలో తప్పుటడుగులు వేసిందని అందుచేతనే ఓటమి పాలైందని నియోజకవర్గ బీజేపీ కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు. కొప్పళ నియోజకవర్గంలో గత మూడు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొంది కొప్పళ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ కోటగా చేశారు. ఆ దిశగానే 2019లో జరిగిన ఎన్నికల్లో కూడా కరడి సంగణ్ణ రెండోసారి గెలుపొందారు. అయితే మూడోసారి టికెట్ ఇవ్వడంలో కరడి సంగణ్ణకు షాక్ ఇచ్చారు. జిల్లాలో కొంతమంది బీజేపీ నాయకులు కరడి సంగణ్ణకు టికెట్ ఇవ్వరాదంటూ హైకమాండ్‌పై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారం చేశారు. ప్రస్తుతం ఎన్నికల ఫలితాల్లో కరడి సంగణ్ణకు టికెట్ ఇవ్వకపోవడమే బీజేపీ ఓడిపోవడానికి కారణమైందని ఎన్నికల విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.



కొప్పళ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాళ్...

రాయచూరులో కాంగ్రెస్ ఘన విజయం

రాయచూరు, జూన్ 4 : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ కుమార్ నాయక్ ఘన విజయం సాధించారు. లోకసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం నగరంలోని ఎల్‌వీడీ, ఎస్‌ఆర్‌పీఎస్ కళాశాలలో చేపట్టగా కాంగ్రెస్ తరపున పోటీ చేసిన కుమార్ నాయక్ తన సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ పై 81,475 ఓట్ల తేడాతో విజయం సాధించారు. గతంలో రాయచూరు జిల్లాధికారిగా, అనంతరం జిల్లా ఇంచార్జ్ కార్యదర్శిగా సుపరిచితుడైన జీ కుమార్ నాయక్ తొలి ప్రయత్నంలోనే కాంగ్రెస్ అభ్యర్థిగా రాజకీయ ఆరంగేట్రం చేస్తూ రాయచూరు లోకసభ స్థానంలో గెలుపొందారు. కుమార్ నాయక్‌కు 6,33,949 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన రాజా అమరేశ్వర్ నాయక్‌కు 5,52,474 ఓట్లు లభించాయి.



విక్టరీగుర్తు చూపిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థిజి.కుమార్

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

యోగి ఆదిత్యనాథ్ (పుట్టినరోజు)




యోగి ఆదిత్యనాథ్ 1972 జూన్ 5న జన్మించారు. అసలు పేరు అజయ్ మోహన్ సింగ్ బిష్త్. 2017 నుంచి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఐదేళ్ళ పాలన పూర్తి చేసి మళ్ళీ సీఎం అయి రికార్డు సృష్టించారు. 12వ లోక్‌సభలో 26వ యేటనే గోరఖ్‌పూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 1998 నుంచి వరుసగా ఐదు సార్లు గెలుపొందారు. తొలిసారిగా గెలుపొందాక 'హిందూ యువ వాహిని'ని ఏర్పాటు చేసి జాతీయస్థాయిలో హిందూత్వ ప్రచారానికి కృషి చేస్తున్నారు. గోరఖ్‌నాథ్ మఠాధిపతిగాను కొనసాగుతున్నారు. ఎంపీగా కంటే హిందూత్వవాదిగా పేరొందారు.

జాన్ మేనార్డ్ కీన్స్ (జయంతి)



స్థూల అర్థశాస్త్రానికి బాటలు వేసిన బ్రిటీష్ ఆర్థికవేత్త జాన్ మేనర్డ్ కీన్స్ 1883 జూన్ 5న కేంబ్రిడ్జిలో జన్మించారు. ఈటన్ కళాశాల, కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయాలలో విద్య అభ్యసించారు. బ్రిటీష్ ప్రభుత్వంలోని ఇండియా కార్యాలయంలో పనిచేసి 'ఇండియన్ కరెన్సీస్ అండ్ ఫైనాన్స్' అనే గ్రంథాన్ని రచించారు. 1930 దశకంలో ఆర్థికమాంద్యం వంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు కీలకమైన సలహా సూచనలు చేశారు. ఆయన రచించిన 'ది జనరల్ థియరీ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్, ఇంటరెస్ట్ అండ్ మనీ' అనే గ్రంథం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్'కు డైరెక్టర్‌గా వ్యవహరించారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో 'హౌ టు పే ఫర్ ది వార్స్' అనే గ్రంథాన్ని రచించారు. ది ఎకనమిస్ట్ పత్రిక ఆయనను బ్రిటన్ దేశ 20వ శతాబ్దపు గొప్ప ఆర్థికవేత్తగా పేర్కొంది. 1946 ఏప్రిల్ 21న కన్నుమూశారు.

ఓ హెన్రీ (వర్ధంతి)



కలం పేరు 'ఓ హెన్రీ'తోనే పేరొందిన విలియమ్ సిడ్నీ పోర్టర్ 1862 సెప్టెంబరు 11న నార్త్ కరోలినాలో జన్మించారు. అమెరికాకు చెందిన ఆయన చిన్నకథల రచయిత. ఆయన కథలు ఆసక్తిగా ఉంటూ మలుపులు తిరుగుతూ ఆశ్చర్యకరమైన రీతిలో ముగింపు కలిగి ఉంటాయి. 381 చిన్నకథలు రాశారు. కవిత్వంలోనూ, నాన్ ఫిక్షన్‌లోనూ రాణించారు. 1910 జూన్ 5న కన్నుమూశారు. ఆయన సేవలను గుర్తించిన అమెరికా ప్రభుత్వం ఉత్తమ చిన్నకథల రచయితలకు 'ఓ హెన్రీ పురస్కారం' ఇస్తోంది.

అరాచకం, గూండాయిజానికి ఏపీలో గుణపాఠం

» తెలుగు ప్రముఖులు అభిప్రాయం

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఎన్నడూలేని విధంగా తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమికి అనూహ్యమైన మెజారిటీ దక్కింది. 175 స్థానాలకుగాను 165 చోట్ల కూటమి గెలుపు బెంగళూరులో నివసించే ప్రవాసాంధ్రులలో సంతోషం నెలకొంది. అరాచకం, గూండాయిజంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఐదేళ్ల తల్లడిల్లారని ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని పలువురు అభిప్రాయపడ్డారు.

ఏపీ ప్రజలకు ఇదో దీపావళి

- పీఈఎస్ వ్యవస్థాపకులు దొరస్వామి



ఎంఆర్ దొరస్వామి

ఆంధ్రప్రదేశ్‌లో అరాచకాలు తారస్థాయిలో కొనసాగాయని, రాష్ట్ర ప్రజల్లో బతుకే భయమనే పరిస్థితి వెంటాడిందని ప్రజలు ఓటు అనే వజ్రాయుధం ద్వారా తగిన గుణపాఠం చెప్పారని ఏపీ ప్రజలకు ఇదో దీపావళి సంబరమని పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు ప్రొఫెసర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ఫలితాలపై ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, పురందేశ్వరిలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జీరో అన్నారు. హింసకు లెక్కలేదనే స్థాయిలో సాగిందన్నారు. ఏపీలో స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఇంతటి ఘోరం జరగలేదన్నారు. ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టారని, ఎన్నో విక్రయించారన్నారు. పాలనకు విలువ లేదని, శాంతిభద్రతలు లేవన్నారు. నియంతృత్వ పోకడతో పాలన సాగించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను మంచి రాష్ట్రంగా చూడాలని భావించిన ప్రజలు ఒక మంచి నిర్ణయానికి వచ్చి చంద్రబాబుకు మద్దతు ఇచ్చారన్నారు. ఇది పూర్తిగా ప్రజా విజయమన్నారు. ఒకప్పుడు ఇందిరాగాంధీపై జేపీ ఉద్యమం సాగినట్టే ఆంధ్రలో రైతులు, మహిళలు, ఉద్యోగులు, కూలి కార్మికులు, కంట్రాక్టు ఉద్యోగులు ఇలా అన్నిరంగాల ఉద్యోగులు ఉద్యమంగా భావించి ఓటుతో గుణపాఠం చెప్పారన్నారు.

న్యాయమే గెలిచింది - పత్తిపాటి ఆంజనేయులు



పత్తిపాటి ఆంజనేయులు

ఆంధ్రప్రదేశ్‌లో న్యాయం గెలిచిందని విశ్వాసానికి నమ్మకానికి రేపటి భవిష్యత్తు ఉండాలనే అన్ని వర్గాలు చంద్రబాబు నాయుడుకు మద్దతు ఇచ్చారని ప్రముఖ నిర్మాణ రంగ వ్యాపారి పత్తిపాటి ఆంజనేయులు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రతినిధి అంటే ప్రజల మధ్య ఉంటూ ప్రజలసమస్యలు తెలుసుకునేవారై ఉండాలన్నారు. మీట నొక్కి సంక్షేమం చేస్తున్నామంటే అది ప్రగతి కాదన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. చేతగానితనం అహంకారానికి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. కియా లాంటి ఒక పరిశ్రమతో వేలమందికి ఉపాధి సాధ్యమైందని ఐదేళ్లలో అటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. విద్య, వైద్యం, నైపుణ్యత సాధించేలా ప్రభుత్వం పాటుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్పష్టమైన మెజారిటీ ఇచ్చారు

- ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రాజు



రమేశ్‌రాజు

ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్పష్టమైన మెజారిటీ ఇచ్చి అభివృద్ధి చేయాలని సంకేతం ఇచ్చారన్నారు. కొత్తరాష్ట్రంలో అమరావతి రాజధాని రానుందన్నారు. ప్రతిపక్షంకు అవసరమైనంత స్థానాలు రాలేదన్నారు. ప్రజలు చంద్రబాబుతోపాటు ఇటీవల ప్రభుత్వం నడిపిన జగన్‌ను పరిశీలించారన్నారు. రాష్ట్రం ఎవరిద్వారా అభివృద్ధి చెందుతుందో నిర్ణయించే ఓటు వేశారన్నారు. టీడీపీ, జనసేనల గెలుపుతో ఆంధ్రప్రదేశ్‌కు మంచి పరిణామం లభించినట్టయ్యిందన్నారు.

తెలుగు ప్రజలు సత్తా చాటారు

- బలుసు శ్రీనివాసరావు



ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లపాలనతో విసుగు చెందిన తెలుగుప్రజలు సత్తా చాటారని ప్రముఖ నిర్మాణరంగ సంస్థ బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ చైర్మన్ బలుసు శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. ఐదేళ్లలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయన్నారు. ప్రకృతిలో దొరికే ఇసుకలోనూ కోట్లు దిగమింగారన్నారు. అభివృద్ధి అనే పదమే లేకుండా పోయిందన్నారు. ఏపీ ప్రజలు భవిష్యత్తును కాంక్షించారని అందుకే కూటమికి 165 స్థానాల మద్దతు ఇచ్చారన్నారు. రాజధానులు లేకుండానే చేశారన్నారు. వేలాదిమంది అన్నదాతలు ఏళ్ల తరబడి మండుటెండలో చేసిన పోరాటానికి దక్కిన ఫలితమన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ దశ, దిశ మారనుందన్నారు.

ఏపీకి మంచిరోజులు వచ్చాయి

- రేవా చాన్స్‌లర్ శ్యామరాజు



శ్యామరాజు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లేకుండా స్మశానాన్ని తలపిస్తోందని, చంద్ర బాబు, పవన్‌కల్యాణ్, బీజేపీల కూటమి గెలుపుతో ఏపీకి మంచిరోజులు వచ్చాయని రేవా యూనివర్సిటీ చాన్స్‌లర్ శ్యామరాజు అభిప్రాయ పడ్డారు. ఒక రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. సంక్షేమం అవసరమేనని అయితే అభివృద్ధి లేకుంటే ఏం లాభమన్నారు. ప్రభుత్వాలు పన్నులు వసూలు చేసి ఉచితాలకే కేటాయిస్తే మౌలిక వసతులు ఎలా ప్రగతి సాధ్యమన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కావడంతోనే తెలంగాణ శక్తివంతమైందన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకున్నా తెలుగు మాట్లాడేవారిగా ఒక రాష్ట్రం నాశనం అవుతుండడంతో బాధ కలిగిందన్నారు. ఏపీలో ఇసుక, మద్యంతోపాటు అన్నింటా అరాచకమే సాగిందన్నారు. పవన్‌కల్యాణ్ ఆరంభం నుంచి ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చనివ్వనని ఇచ్చిన మాట నిజం చేశారన్నారు. ఏపీలో గెలుపుకు పవన్‌కల్యాణ్ కీలక భూమిక పోషించారని చంద్రబాబుపై ప్రజలు విశ్వాసం చూపారన్నారు.

టీడీపీకి ఈ ఫలితాలు ముందుగానే ఊహించా - పత్తిపాటి ప్రభాకర్



పత్తిపాటి ప్రభాకర్ తదితరులు

తెలుగుదేశం పార్టీకి ఇటువంటి చారిత్రాత్మకమైన ఫలితాలు ముందుగానే ఊహించానని ప్రముఖ పారిశ్రామికవేత్త పత్తిపాటి ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. నెలరోజులుగా రాప్తాడులో ఎన్నికలకోసం పనిచేశానన్నారు. అయితే రాష్ట్రమంతటా మిత్రులు, బంధువుల ద్వారా రోజూ సమీక్ష చేసుకున్నానన్నారు. ఎక్కడా సందేహమే రాలేదన్నారు. 165 స్థానాలు కూటమికి రావడం వెనుక ఎన్నో వర్గాల ప్రజల ఆశలు ఉన్నాయన్నారు. ఒక రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నియంతృత్వం కాకుండా ప్రజలమధ్యన ఉండే నేతలు ముఖ్యమన్నారు. రాప్తాడులో శ్రీరామ్, సిద్ధార్థలతో కలసి పనిచేశానని, పరిటాల సునీతమ్మ మరోసారి గెలుపు సంతోషంగా ఉందన్నారు.

ఆంధ్రలో ఆశ్చర్యకర ఫలితాలు

- ఏఎంసీ విద్యాసంస్థల పరమహంస



పరమహంస

ఏపీ ప్రజలు అభివృద్ధిని ఆకాంక్షించి ఆశ్చర్యకరమైన ఫలితాలు ఇచ్చారని ఏఎంసీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ పరమహంస అభిప్రాయ పడ్డారు. సంక్షేమం అవసరమేనని అయితే అది అభివృద్ధి లేకుండా సాగరాదన్నారు. నగరాలు, పట్టణాలలో నివసించేవారు వాణిజ్య, ఆదాయ పన్నులు చెల్లిస్తారని ఆ సొమ్ము గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కారణం కావాలన్నారు. అయితే సంక్షేమం పేరిట పంచుకుపోతే ఎలా సాధ్యమన్నారు. ప్రజల్లోనూ మార్పు రావాల్సి ఉందన్నారు. శాశ్వతమైన ప్రయోజనాలు కావాలన్నారు. ప్రజా ప్రతినిధులు పోటీ కోసం దారులు తప్పరాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమికి అత్యధిక స్థానాలు రావడం సంతోషమని, చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరిలకు శుభాకాంక్షలన్నారు. అయితే గత ఐదేళ్లలో కొనసాగని అభివృద్ధి చేయాలన్నారు. ఇలా పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

వారసుల్లో ముగ్గురికి షాక్

» మరో ముగ్గురిని వరించిన విజయం

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో వారసులకు టిక్కెట్లు దక్కించుకుని నేరుగా లోక్‌సభకు పంపాలని భావించిన ముగ్గురు మంత్రులకు ప్రజలు షాక్ ఇచ్చారు. మరో ముగ్గురు విజయం సాధించారు. గడిచిన శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓటమి చెందినా బెంగళూరు దక్షిణ నుంచి బరిలోకి దిగి సౌమ్యారెడ్డి ఓడిపోవడంతో రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డికి షాక్ తగిలింది. బెళగావి నుంచి మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్ హెబ్బాళ్కర్ ఓడిపోయారు. బాగల్కోటె నుంచి మంత్రి శివానంద పాటిల్ కుమార్తె సంయుక్తా పాటిల్ ఓటమి చెందారు. శివమొగ్గ నుంచి అక్క గీతను బరిలో దింపిన విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప గెలిపించుకోలేకపోయారు. బెళగావి జిల్లా చిక్కోడి నుంచి మంత్రి సతీశ్ జార్కిహొళి కుమార్తె ప్రియాంక జార్కిహొళి విజయం సాధించారు. చామరాజనగర నుంచి మంత్రి మహదేవప్ప కుమారుడు సునిల్ బోస్ విజయం నమోదు చేశారు. బీదర్ నుంచి అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె కుమారుడు సాగర్‌ఖండ్రె సునాయాసంగా గెలుపొందారు. రాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో సాగర్ ఖండ్రె అత్యంత పిన్నవయస్కుడు 26 ఏళ్లకే రికార్డు నమోదు చేశారు.

ఇద్దరు కేంద్రమంత్రులు విజయం.. ఒకరు ఓటమి

కేంద్రంలో మంత్రులుగా కొనసాగుతూ ఇద్దరు మరోసారి విజయం సాధించగా బీదర్ నుంచి పోటీ చేసిన భగవంత్ ఖూబా ఓటమి పాలయ్యారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు గనులశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న ప్రహ్లాద్‌జోషి మరోసారి ధారవాడ నుంచి విజయం సాధించారు. టిక్కెట్ ఖరారయ్యాక ఆయనపై తీవ్రమైన వ్యతిరేకతతో పాటు ఓ స్వామిజీ బరిలోకి దిగేందుకు ప్రయత్నించడంతో ఉత్కంఠగా రేపింది. చివరకు సునాయాసంగా విజయం సాధించారు. కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రిగా వ్యవహరిస్తున్న శోభాకరంద్లాజె బెంగళూరు ఉత్తర నుంచి గెలుపొందారు. ఆమె ఉడుపి - చిక్కమగళూరు నుంచి ప్రస్తుతం ఎంపీగా ఉన్నారు. రాజకీయ కారణాలతో ఆమెకు బెంగళూరు ఉత్తరకు టిక్కెట్ ఇవ్వగా విజయం సాధించారు. కేంద్ర రసాయన, ఎరువులశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న భగవంత్ ఖూబా చిత్తుగా ఓడారు. అపారమైన రాజకీయ అనుభవం కల్గిన ఖూబా అత్యంత పిన్నవయస్కుడైన సాగర్‌ఖండ్రె చేతిలో ఓడిపోయారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు అభ్యర్థులను గెలిపించకుంటే మంత్రి పదవులను వదులుకోవాలని పార్టీ చేసిన హెచ్చరికపై ఉత్కంఠ నెలకొంది. అదే జరిగితే పలువురు మంత్రి పదవులు కోల్పోయే అవకాశం ఉంది.

ఓడిపోయిన ఐదుగురు సిట్టింగ్‌లు

ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు చిత్తుగా ఓడిపోయారు. వీరిలో బీదర్ నుంచి కేంద్రమంత్రి భగవంత్ ఖూబా, కలబురగి నుంచి ఉమేశ్‌జాధవ్, చిక్కోడి నుంచి అన్నాసాహెబ్ జొల్లె ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి ఏకైక సిట్టింగ్ ఎంపీ డీకే సురేశ్ బెంగళూరు గ్రామీణ నుంచి చిత్తుగా ఓడిపోయారు. జేడీఎస్ నుంచి ఏకైక ఎంపీగా కొనసాగి ప్రస్తుతం రాసలీలల వివాదంలో ఇరుక్కున్న ప్రజ్వల్ రేవణ్ణ ఓడిపోయారు.

నియోజకవర్గాల వారీ విజేతలు

నియోజకవర్గం	విజేత	పార్టీ
1. బెంగళూరు ఉత్తర	శోభాకరంద్లాజె	బీజేపీ
2. బెంగళూరు దక్షిణ	తేజస్వి సూర్య	బీజేపీ
3. బెంగళూరుసెంట్రల్	పీసీ మోహన్	బీజేపీ
4. బెంగళూరుగ్రామీణ	డాక్టర్ మంజునాథ్	బీజేపీ
5. చామరాజనగర	సునిల్‌బోస్	కాంగ్రెస్
6. చిత్రదుర్గ	గోవింద కారజోళ	బీజేపీ
7. చిక్కబళ్ళాపుర	డాక్టర్ కే సుధాకర్	బీజేపీ
8. కోలారు	మల్లేశ్‌బాబు	జేడీఎస్
9. మండ్య	హెచ్‌డీ కుమారస్వామి	జేడీఎస్
10. దక్షిణకన్నడ	కేప్టెన్ బ్రిజేశ్ చౌట	బీజేపీ
11. హాసన్	శ్రేయస్ పటేల్	కాంగ్రెస్
12. మైసూరు	యదువీర్	బీజేపీ
13. తుమకూరు	వీ సోమణ్ణ	బీజేపీ
14. ఉడుపి-చిక్కమగళూరు	కోట శ్రీనివాసపూజారి	బీజేపీ
15. శివమొగ్గ	రాఘవేంద్ర	బీజేపీ
16 దావణగెరె	ప్రభా మల్లికార్జున్	కాంగ్రెస్
17 హావేరి	బసవరాజ్ బొమ్మై	బీజేపీ
18 ఉత్తరకన్నడ	విశ్వేశ్వరహెగ్డే కాగేరి	బీజేపీ
19 బళ్ళారి	ఈ తుకారాం	కాంగ్రెస్
20 రాయచూరు	కుమార్ నాయక్	కాంగ్రెస్
21 బీదర్	సాగర్ ఖండ్రె	కాంగ్రెస్
22. ధారవాడ	ప్రహ్లాద్‌జోషి	బీజేపీ
23. బెళగావి	జగదీశ్‌శెట్టర్	బీజేపీ
24. చిక్కోడి	ప్రియాంక జార్కిహొళి	కాంగ్రెస్
25. బాగల్కోటె	పీసీ గద్దిగౌడర్	బీజేపీ
26 కలబురగి	రాధాకృష్ణ దొడ్డమని	కాంగ్రెస్
27. విజయపుర	రమేశ్ జిగజిణగి	బీజేపీ
28 కొప్పళ	రాజశేఖర హిట్నాల్	కాంగ్రెస్

కోలారులో జేడీఎస్ మల్లేశ్‌బాబు విజయం



మల్లేశ్‌బాబుకు ధ్రువీకరణపత్రం అందజేత

బంగారపేట, జూన్ 4: కోలారు లోక్‌సభ రిజర్వు నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థి మల్లేశ్‌బాబు ఘన విజయం అందుకున్నారు. కోలారు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం 7 గంటలనుంచి మొత్తం 21 రౌండ్ల కౌంటింగ్ సాగింది. తొలుత పోస్టల్‌బ్యాలెట్‌ను లెక్కించగా అనంతరం ఈవీఎం ఓట్లను లెక్కించారు. బరిలో ఉన్న 18 అభ్యర్థుల భవితవ్యం సాయంత్రం 5 గంటలకు తేలింది. బీజేపీ-జేడీఎస్ మైత్రి అభ్యర్థి మల్లేశ్ బాబు గెలుపొందారు. ఫలితాలు ప్రకటించిన అనంతరం కార్యకర్తలు మునిస్వామి, మల్లేశ్‌బాబులను భుజాలపై మోస్తూ సాగారు. మద్దతుదారులు పూలహారాలు వేసి విజయోత్సవ నినాదాలు చేశారు. మిఠాయిలు పంచిపెట్టి సంతోషం వ్యక్తం చేశారు. కాగా కౌంటింగ్ కేంద్రంలోకి గుర్తింపు కార్డులు కల్గినవారిని మాత్రమే అనుమతించగా సెంటర్ వద్ద అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ముందస్తుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. 16వ రౌండ్ కౌంటింగ్ ముగిశాక ఓటమి తేలడంతో కాంగ్రెస్ అభ్యర్థి, ఆయన మద్దతుదారులు నిరాశతో కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుతిరిగారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 414మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

మెజారిటీ వివరాలిలా...

జేడీఎస్ అభ్యర్థి ఎం మల్లేశ్‌బాబుకు 6,91,481 ఓట్లు రాగా ప్రత్యర్థి ఐఎన్‌డీఐఏ అభ్యర్థి కేవీ గౌతమ్‌కు 6,20,093 ఓట్లు వచ్చాయి. దీంతో 71,388 ఓట్ల మెజారిటీతో గెలుపు సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఇతర అభ్యర్థులకు 8వేల నుంచి 400 ఓట్లు రాగా నోటాకు 5,831 ఓట్లు లభించగా 1206 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం 13,49,397 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి.

టీడీపీ విజయంపై సంబరాలు

బొమ్మనహళ్ళి, జూన్ 4: ఆంధ్రప్రదేశ్‌లో సైకో పాలనకు చరమగీతం పాడినట్టయ్యిందని, తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో ప్రవాసాంధ్రులు సంబరాల్లో మునిగారు. మంగళవారం పలు చోట్ల బొమ్మనహళ్లి, హెచ్ఎస్ఆర్ లే అవుట్, ఆర్‌కే నగర్, దేవరచిక్కనహళ్ళి, సిల్క్‌బోర్డ్ తదితర ప్రాంతాల్లో ప్రవాసాంధ్రులు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. బాణాసంచా కాల్చి ఉత్సాహంగా గడిపారు. పృథ్విసాయికుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టాపాకాయలు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. బస్సులోని ప్రయాణీకులకు కూడా మిఠాయిలు పంచారు. తెలుగుదేశం జెండాలతో ఊరేగారు. రాష్ట్ర చరిత్రలోనే ఇదొక ప్రభంజనంలా ఉందని సైకో పాలనలో ప్రజలు, యువకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పలువురు అభిప్రాయపడ్డారు. చంద్రబాబు సీఎం అయితే కూలికార్మికులకు ఎంతో ఉపాధి కానుందన్నారు. వెంకటరాజు, జమున, హంసిని, గంగాధర్, మంజునాథ్, బాలు, సిద్దూ, ప్రభ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌కే నగర్‌లో మిఠాయిలు తినిపిస్తూ...

బీజేపీ విజయోత్సవం

బొమ్మనహళ్ళి, జూన్ 4: బెంగళూరు దక్షిణ బీజేపీ అభ్యర్థి తేజస్వి సూర్య గెలుపొందడంపై బొమ్మనహళ్ళిలో విజయోత్సవం నిర్వహించారు. 2,75,000కుపైగా మెజారిటీ సాధించడం గొప్ప విజయమని బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తెలిపారు. బొమ్మనహళ్ళి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే 50వేలకుపైగా ఆధిక్యం వచ్చిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డిపై విజయం సాధించారని, కాంగ్రెస్ పథకాలను ప్రజలు విశ్వసించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ కూటమి ఘన విజయం సాధించడంపై శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ మంజునాథరెడ్డి, మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్‌సలాం, స్థానిక నాయకులు అనిల్‌కుమార్, గోపి, నాగభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ అభిమానుల ఊరేగింపులో ఎమ్మెల్యే తదితరులు

బాగేపల్లిలో సంబరం...



జెండాలతో అభిమానులు ఇలా...

బాగేపల్లి, జూన్ 4: సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన కూటమి భారీ మెజారిటీతో గెలుపొందడంపై పట్టణంలో మంగళవారం అభిమానులు సంబరాలు జరిపారు. టీడీపీ, జనసేన, పవన్‌కల్యాణ్, నందమూరి బాలకృష్ణ అభిమానులు జెండాలతో ఊరేగారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డు, డాక్టర్ హెచ్ఎన్ సర్కిల్, బస్టాండ్ నుంచి అభిమానులు సందడి చేశారు. బాణా సంచా కాలుస్తూ కేరింతలు కొట్టారు. మిఠాయిలు పంచారు. పట్టణంలో ఎటు చూసినా సందడి నెలకొంది. తమ అభిమాన నాయకుల నినాదాలు చేశారు.

సంతకాల దుర్వినియోగంపై గ్రామస్థుల ఆక్రోశం

చింతామణి, జూన్ 4: తాలూకాలోని మురగమల్లె గ్రామంలో స్వచ్ఛత పాటించడం, వీధికుక్కల నియంత్రణకోసమని గ్రామంలోని సుమారు 50మందికిపైగా ప్రజలనుంచి ఖాళీ కాగితాల్లో సంతకాలు పొంది దుర్వినియోగం చేయడంపై గ్రామస్థులు మండిపడ్డారు. రోహిద్, రియాజ్‌లు సంతకాల సేకరణ చేశారన్నారు. మంత్రికి ఫిర్యాదు చేసేందుకు అర్జీలు సమర్పించాలని సంతకాలు తీసుకుని దుర్వినియోగం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాలూకా పంచాయతీ ఈఓకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తాము చేసిన సదరు సంతకాల అర్జీతోపాటు మరో లేఖను రాసి ప్రభుత్వ భూముల అక్రమాలకు పాల్పడుతున్నారంటూ వ్యవసాయ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు మురగమల్లె గ్రామపంచాయతీలోని అవినీతిపై నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈమేరకు గ్రామస్థులంతా చేరి ఈఓకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తాము స్వచ్ఛత, వీధికుక్కల నియంత్రణకోసం సంతకాలు చేశామని అయితే తమ సంతకాలతో కూడిన అర్జీని దుర్వినియోగం చేశారని స్పష్టం చేశారు. దీనిపై ఈఓ స్పందిస్తూ సంతకాల సేకరణ దుర్వినియోగంపై ఆరా తీసి చర్యలు తీసుకుంటామన్నారు. సంతకాలు సేకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

బదిలీ చేసినా ఓటమే

హిందూపురం, జూన్ 4: ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు సామంత రాజులుగా వ్యవహరించారు. భూ సెటిల్‌మెంట్లు, దందాలు, అవినీతితో వందల కోట్లు వెనుకేసుకున్నారు. ఈనేపథ్యంలో ఆపార్టీ అధినేత జగన్మోహనరెడ్డి జిల్లాలో కొన్ని చోట్ల అభ్యర్థులను బదిలీ చేశారు. అయినా జనం ఎవ్వరూ నమ్మలేదు. కళ్యాణదుర్గంలో ఉష శ్రీచరణ్ చేసిన ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. సొంత పార్టీ నాయకులపైనే కేసులు పెట్టించారు. వందల ఎకరాల భూములు కొట్టేశారు. అందుకే కళ్యాణదుర్గంలో అయితే ఆమె గెలవరని పెనుకొండకు పంపారు. ఇక్కడ ఉన్న శంకరనారాయణను అనంతపురం పంపారు. అయితేనేం ఇద్దరూ ఓడిపోయారు. ఇక్కడ ఉన్న గోరంట్ల మాధవ్ వికృత చర్యలకు ఆయనను పక్కన పెట్టి కర్ణాటకకు చెందిన శాంతమ్మను తీసుకొచ్చి పోటీ పెట్టారు. ఆమె గెలవలేదు. మడకశిరలో సామాన్య వ్యక్తి అని ఈరలక్కప్పకు టికెట్ ఇచ్చారు. కదిరిలో సిద్దారెడ్డికి కాదని మగ్బూల్‌కి ఇచ్చారు. ఈ చర్యలన్నీ బెడిసి కొట్టి వైసీపీకి మరువలేని పరాజయాన్ని మిగిల్చాయి.

సంతలో కొరవడిన స్వచ్ఛత

శిడ్లఘట్ట, జూన్ 4: వారపుసంత ప్రదేశంలో స్వచ్ఛత కొరవడిందని, కాలువలపై దుకాణాలు నిర్వహిస్తున్నారని తద్వారా ఇక్కడ కొనే కూరగాయలు, నిత్యావసరాలతో అనారోగ్యం తప్పదని రైతుసంఘం రవిప్రకాశ్ ఆక్రోశం వ్యక్తం చేశారు. సోమవారం సంతను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్ని దుకాణాల తూకాలలోనూ మోసం జరుగుతోందని ఆరోపించారు. స్నేహితుడు దేవరాజ్‌తో కలసి నిత్యావసరాలు, కూరగాయల కొనుగోలుకు వస్తే కొన్ని చోట్ల కేజీకిగాను 700-800 గ్రాములు మాత్రమే ఉన్నట్టు గుర్తించామని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా బదులిచ్చారన్నారు. అక్కడికి వచ్చిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ కూడా పరిశీలించి ప్రశ్నించగా అదే తరహాలోనే వ్యవహరించారన్నారు. తీరు మార్చుకోకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారన్నారు. పలు వస్తువులపై దోమలు ఉన్నాయని అటువంటి పదార్థాలను వండితే అనారోగ్యం తప్పదన్నారు. నగరసభ కమిషనర్ దృష్టికి తెచ్చి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



సంతలో పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్

సోషల్‌ఆడిట్ సమావేశంపై వివరణ



మీడియాతో నాగేశ్ తదితరులు

శిడ్లఘట్ట, జూన్ 4: పట్టణంలోని కార్యనిరత పాత్రికేయుల సంఘం భవనంలో తాలూకాలోని జై వెంకటాపుర గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఎన్ నాగేశ్ మీడియాతో మాట్లాడుతూ గ్రామపంచాయతీ పాలనపై పంచాయతీ సభ్యురాలు శశికళ అంబరీశ్‌కు కనీస అవగాహన లేదన్నారు. గ్రామసభకు, సోషల్ ఆడిట్ సభకు తేడా తెలియదని ఆరోపించారు. పలు పాలనా అంశాలపై అవగాహన లేకనే ఆరోపణలు గుప్పిస్తున్నారన్నారు. మే 30న గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్‌కు సంబంధించి గ్రామసభ జరిగిందని అందుకు సంబంధించి కరపత్రాలు కూడా ఇచ్చామన్నారు. అధికారులకు కూడా సమాచారం తెలిపామన్నారు. సోషల్‌ఆడిట్ సభకు సంబంధించి ఫోటోలు, వీడియోలు కూడా ఉన్నాయన్నారు.

